కొత్తపల్లి

పిల్లల కథల పుస్తకం



55

కొత్తపల్లి పిల్లల కథల పుస్తకం-55 నవంబరు 2012

మూలం: http://kottapalli.in/2012/11/welcome

మొత్తం ప్రతుల సంఖ్య: 2000

సంపాదకులు: నారాయణ

ముఖచిత్రం '': వీరాంజనేయులు

అక్షర కూర్పు: *కొత్తపల్లి*

వెల: రూ.20/-

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ వాణిజ్యేతర కార్యక్రమాలకోసం మీ అంతట మీరే దీన్ని ముద్రించుకోవచ్చు!

కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

ఫోను: 08559 240222, 7702877670 ఇ-మెయిలు: team@kottapalli.in



విషయ సూచిక

నవంబరు నెల



"చక్కని బొమ్మా రావమ్మా

పాలూ పెరుగూ తినవమ్మా

ఆటలు బాగా ఆడమ్మా

ఆరోగ్యంగా ఉండమ్మా..." పాడుతోంది చిట్టి, తన బొమ్మను ముద్దు చేస్తూ.

బయట కాకి అరుస్తోంది.

అంతలో తాతయ్య వచ్చాడు. కాకిని తోలుతూ -



"కాకీ కాకీ ఎగిరిపో

మా చిట్టి చిన్నది

చిట్టి బొమ్మ చెక్కది

నీ ముక్కే మోగట్టిది!" అని పాడాడు.

"ఊరుకో తాతయ్యా!" అంది చిట్టి, మూతి ముడుచుకొని.

"ఏం చెప్పినా తియ్యగా చెప్పాలమ్మా!" అంటూ తాతయ్య ఇంకో పాట అందుకున్నాడు -



"తీయని పలుకల చిలకమ్మ

కమ్మని కూతల కోయిలమ్మ

చల్లని వెలుగుల చంద్రమ్మ

మా చిట్టి పాపే కదమ్మా?!" అని.

చిట్టి నవ్వింది - తనూ పాటల ఆటలోకి దిగింది-



"కాకి వచ్చి వాలింది
నక్కి నక్కి కూచుంది-
బొక్కి నోరు చూసింది
తొర్రేమో అనుకుంది -
ఎగ్గిరి పైకి దూకింది
ముక్కుని నోట్లో దూర్చింది
ఇరుక్కు పోయి ఏడ్చింది!" అని పాడింది- తాతయ్య బోసి నోటిని ఎగతాళి చేస్తూ తాతయ్యకూడా నవ్వాడు.



"అబ్బ మాపాప చూడు-
బడికి పోయి వస్తుంది
తిట్లూ దెబ్బలు తింటుంది.
చదవమంటే రాదు
రాయమంటే కదలదు -
అంతేకాదు - యీ నెల ఏదో తెలీనే తెలీదు!" వెక్కిరించాడు సరదాగా.

"నాకెందుకు తెలీదు? ఇది నవంబరు నెల!" అంది చిట్టి ఉడికిపోతూ. "అయినా మా బళ్లో నేనెప్పుడూ తిట్లూదెబ్బలు తిననేలేదు తెలుసా? ఎప్పుడూ అందరూ మెచ్చుకుంటూనే ఉంటారు నన్ను -" అంది కుళ్లుకుంటూ.


"మరయితే ఈ నెల్లో ఏమేమొస్తాయమ్మా, చెప్పు చూద్దాం?!" రెట్టించాడు తాతయ్య.

"దీపాల వరసలు

మతాబాల వెలుగులు

టపాకాయ చప్పుళ్ళు

తియ్య తియ్యని స్వీట్లు -"



-నాకెందుకు తెలీదు? నేను అప్పుడే తుపాకీ బిళ్ళలు కూడా కొనేసుకున్నాను! ఈ నెల్లోనే, దీపావళి!" అంది చిట్టి ఉత్సాహంగా.

"ఇంకోటి కూడా ఉంది! మరిచి పోయావు! పిల్లల పండుగ!" అన్నాడు తాతయ్య,

"పండిత నెహ్రూ పుట్టిన రోజు-

పిల్లలందరికి పండుగరోజు!" అని పాడుతూ.


"మోసం! ఇది నీ సొంతం కాదు- సొంత పాటలే పాడాలి ఇవాళ్ల! ఓడిపోయావు-అంతే!" అరుస్తూ బయటికి పరుగుతీసింది చిట్టి.

మీసాల మాటున ముసిముసిగా నవ్వాడు తాతయ్య- "చిట్టికి అన్నీ తెలుసే, బాలల దినోత్సవం పాట కూడా తెలుసు!" అని.

అందరికీ దీపావళి, బాలలదినోత్సవ ప్రత్యేక శుభాకాంక్షలు.

కొత్తపల్లి బృందం.

మీరు రాసిన కథల్నీ, కవితల్నీ, మీరు పాడిన పాటల్నీ, మీరు సేకరించిన జోకుల్నీ, మంచి మంచి సంగతుల్నీ అందరు పిల్లలతోటీ పంచుకోండి! వాటిని కొత్తపల్లికి పంపండి!



నీతి చంద్రిక

విగ్రహం 12

జరిగిన కథ : హంస రాజ్యం మీదికి నెమలి దండెత్తి వస్తున్నది. ముందుగా తన గూఢచారి కాకిని పంపింది. ఆ కాకి సింహళ దేశం నుండి వచ్చినట్లు, హంసరాజు ఆశ్రయం కోరుతున్నట్లు చెప్పుకొని, బయట నిలచి ఉన్నది. హంసరాజుకి ఆ కాకిని చూడక ముందే అదంటే ఇష్టం ఏర్పడ్డది. కానీ మంత్రి సర్వజ్ఞుడు దాన్ని వారిస్తూ, నీలిరంగు నక్క కథ చెప్పసాగింది. అప్పుడేం జరిగిందో చదవండి- ఇదిగో, నీతి చంద్రిక-36 వ భాగం..

మూలం: కీ.శే. కందుకూరి వీరేశలింగం సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ.

ఈ విధంగా సింహాలు, పులులు అన్నీ తనకు దాసులై, తన మాటను కాదనక ప్రవర్తిస్తూండేసరికి, నక్కకు మెల్లగా గర్వం తలకెక్కింది. పొగరుమోతు తనం కొద్దీ అది తన జాతి వాళ్లను అవమానించటం, చిన్నచూపు చూడటం మొదలు పెట్టింది. రాను రాను అది తోటి నక్కల మొహాలను చూసేందుకు కూడా ఇష్టపడనట్లు తయారైంది. దాంతో ఆ నక్కలకు దు:ఖం ముంచుకొచ్చింది. మనసులు కష్ట పెట్టుకొని,

అవి అన్నీ ఒకరోజున రహస్యంగా కలసి కూర్చొని తమ బాధల్ని కలబోసుకొన్నాయి.



అప్పుడు వాటిలో ఒక ముసలి నక్క అందరినీ ఉద్దేశించి "చూడండి, ఇదంతా మనం స్వయంగా చేసుకున్న అపరాధం తప్ప, వేరు కాదు. మన రాత ఇట్లా ఉంది కనుక, తెలివిమాలి మనమే అతనికి పాలనాధికారాన్ని కట్టబెట్టాము. ఆ పదవి తలకెక్కటం చేత అతనికి ఇప్పుడు కాకి-కోకిల రెండూ ఒకటిగానే కనబడుతున్నాయి. ఎంత మేలు చేసినాగాని, మనం అతనికి స్నేహితులం కాగలిగామా? పొగరుమోతులకు చేసిన మేలు వృధా అవ్వటమే కాదు; అలా మేలు చేసిన వాళ్లకు కూడా కష్టాలను తెచ్చిపెడుతుంది. తప్పుడు వాడి దగ్గర నిలచి ఉండటం మన తప్పే. ఇంతకాలం వీడి దగ్గర ఊడిగం చేసి వీడిచేత తినరాని తిట్లు తిని తిని- మన ఎముకలన్నిటికీ చిల్లులు పడ్డాయి. ఇప్పుడు పరిస్థితి విషమించింది. వీడిని ఇన్నాళ్ళూ ఏదో మట్టి కుండను మోసినట్లు తలపైకి ఎత్తుకొని మోశాము- ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ఆ కుండను కటిక నేలమీద పడేసి పగల-గొట్టకపోతే మన ప్రాణాల మీదికే వస్తుంది. ఈ నీచుడు రాజ్యమదంతో కళ్ళు మూసుకు-పోయి క్రింద-మీద తెలీకుండా ఉన్నాడు. తనవారు ఎవరో, పరాయి వాళ్లెవరో కూడా తెలీటం లేదు వీడికి. మనం అందరం వీడి అబద్ధాలను నిజమని నమ్మి మోసపోయాము. 'నక్క ఎక్కడ-నాగలోకం ఎక్కడ?' గుంటలో నివసించే నక్కకు దేవతలు స్వయంగా రాజ్యాధికారం ఇవ్వటమేమిటి- ఇదంతా ఒట్టి మాటే. ముందు దీనికి ఎలాగో ఒక నీలిరంగు అబ్బింది- అటుపైన దానిని వాడుకొని, మిగిలిన మాయోపాయాలన్నిటినీ ఇది

తనంతట తాను పన్ని ఉంటుంది. అద్భుతమైన ఈ రంగు ఎలా వచ్చిందో తెలీక మనందరం ఈ విధంగా నిశ్చేష్టులం అయి-పోయి ఉన్నాం. దీని మాయ వేషాలను నిజం అనుకొని అందరిలోనూ నవ్వులపాలు అయిపోయాం. ఒక్క మనమే అనేది ఎందుకు? -గొప్ప గొప్ప సింహాలు, పులులు అన్నీ కూడా ఈ టక్కరి నక్క చేత ఘోరావమానానికి గురయ్యాయి. మనమే తెలివి గలవాళ్లం అనుకుంటే మన రాజులు ఇంకా తెలివైనవాళ్ళు!

ఇప్పుడు ఇక గతించిన దానిని త్రవ్వుకొని ఏం లాభం? మన తెలివితక్కువతనమే పరిస్థితిని ఇంతవరకూ తెచ్చింది. ఇప్పుడైనా మనం కళ్ళు తెరిచి ఏదో ఒకటి చేయకపోతే దాని చేష్టలు మరీ శృతి మించే ప్రమాదం ఉన్నది. ఇప్పుడు వాడు పట్టిందల్లా బంగారం అవుతున్నది కదా అని వాడిని వెనక వేసుకురావటం తగదు. కాలం కలిసి వచ్చినప్పుడు ఎంత దుర్మార్గులకైనా సంపదలు సమకూరతాయి; కాలం సహకరించకపోతే ఎంత మంచి వాళ్లకైనా దుర్గతి ఎదురవు-తుంటుంది. అయినా మంచిమార్గంలో ఉన్నవాళ్ళే ఆపదలను అన్నిటినీ తట్టుకొని నిలబడతారు; అంతిమంగా విజయం వాళ్ళనే వరిస్తుంది.

వీడికి కాలం మూడింది గనకనే వీడు అందరితోటీ దురుసుగా ప్రవర్తించటం మొదలుపెట్టాడు. 'చెట్టు చెడే కాలంలో కుక్కమూతి పిందెలు వస్తాయట!' చెడేకాలం దగ్గర పడటం వల్లనే వీడికి ఇలాంటి దుర్బుద్ధి పుట్టినట్లున్నది. 'వినాశకాలే విపరీత బుద్ధి' అని పెద్దలు ఊరికే అనలేదు. పట్టు పురుగులాగా, ఈ గుంటనక్కకూడా తనను కట్టేసే త్రాళ్లను తానే వెంట తెచ్చుకున్నది-గమనించండి. మరి సింహాలు, అడవి పందులు కూడా దీనికి దాసులై దీనిని కొలుస్తున్నాయని మనం భయపడనవసరం లేదు. విషయాలు తెలిసినవాళ్లను అవమానించినప్పుడు దాని ఫలితం ఎంతవారికైనా అనుభవంలోకి రావలసినదే. మనం అజ్ఞానులం కాదు- విషయం మొత్తం

తెలిసినవాళ్లం. అందువల్ల ఈ శత్రువును పరాభవించటం మన చేతిలోని పని. నేను ఒక ఉపాయం చెబుతాను, వినండి- ఈ రోజున మనందరం వీడికి ఎదురుగా నిలబడి ఒక్క పెట్టున ఊళలు పెడదాం. వీడు జాతి స్వభావం కొద్దీ మనతోబాటు తానూ కూయటం మొదలు పెడతాడు. అక్కడ చేరిన పులులు, సింహాలలో ఏదో ఒకదానికి దాని ఆ అరుపును విని కోపం రాకపోదు; అది అమాంతంగా దాని మీదికి దూకి ఆ గుంటనక్కను చంపక వదలనూ వదలదు. భగవంతుని సంకల్పం అనుకూలిస్తే శత్రు సంహారం అతి సులువుగా జరిగిపోతుంది. అపాయం ఏమాత్రం లేని ఉపాయం ఇంతకంటే మంచిది వేరే లేదు- ఏమంటారు, చెప్పండి?" అన్నది.

అమృత సమానాలైన ఆ మాటలు చెవిన పడగానే మిగిలిన నక్కలన్నీ పరిపూర్ణమైన ఆనందంతో గంతులు వేసాయి. అవన్నీ అప్పటికప్పుడు బయలుదేరి, సాయం సమయం అయి చంద్రుడు ఉదయించే సరికల్లా నీలి నక్క దర్బారు చేరుకున్నాయి. అటుపైన అన్నీ దానికి ఎదురుగా నిలబడి, 'ఆ రాజ్యం ఇక అంతరించిందేమో 'అన్నట్లు ఒక్కసారిగా "ఓ....." అని ఊళలు వేశాయి.



పుట్టుకతో వచ్చిన అలవాట్లు అంత సులువుగా పోవు కదా! నక్కరాజుకు ఆ కూత వినబడగానే, అది జాతి ధర్మ ప్రేరేపితం అయిపోయింది. విధి రాత తప్పించుకో-లేనట్లు, చెవులు పిక్కటిల్లేటట్లు రేగిన ఆ కూతతో తనూ గొంతు కలిపింది!

ఆ రొద చెవిన పడగానే, దాని ప్రక్కనే నిలబడి ఉన్న పెద్దపులి ఒకటి అకస్మాత్తుగా 'అది నక్క కదా' అనుకొని, తన ధర్మం ప్రకారం తను ఒక్కసారిగా లేచింది. పళ్ళు నూరి, మెరుపు మెరసినట్లు చెంగున దాని మీదికి దూకి చటుక్కున దాని గొంతు కొరికి చంపేసింది. నెత్తురు వరదలైపారింది. మిగిలిన జంతువులన్నీ ఒక్కసారిగా లేచి, నీలి నక్క

దుర్గతిని గురించి మాట్లాడుకుంటూ తమ దారిన తాము పోయాయి. అంతకు మునుపు ఆందోళనతో అటూ ఇటూ పరుగులెత్తిన తోటి నక్కల మనస్సులన్నీ ఒక్కసారిగా చల్లబడ్డాయి!


కాబట్టి, పరాయివాళ్లతో చేరి తనవారిని చిన్నచూపు చూడటం ఏమాత్రం మంచిది కాదు. ఈ కాకిని చేరదీయటం, ఎందుకనో, నాకు ఇష్టం కావటం లేదు. నేను చెప్పవలసినది చెప్పాను. ఇక తమరు ఎలాగంటే అలా చేద్దాము" అన్నది మంత్రి సర్వజ్ఞుడు.

దాని మాటలు విని హంసరాజు -"మనం ఇంకొద్ది రోజుల్లో దారుణమైన యుద్ధాన్ని ఒకదాన్ని ఎదుర్కోనాల్సి ఉన్నది. ఆలోగా చాలామంది వీరులను సమీకరించుకోవలసి ఉన్నది. వెతకబోయే తీగ కాలికి చుట్టుకున్నట్లు, ఈ వీరుడు మనం ఇంకా కోరకనే వచ్చి మన వాకిటికి ఎదురుగా నిలబడి ఉన్నాడు. సంపద వస్తానంటే కాదని మోకాలు అడ్డంపెట్టేది ఎందుకు? మన పాలిటి పుణ్యమే ఈనాడు ఇతని రూపంలో వచ్చి నిలచింది మన ముందు. కష్టాలు మన ప్రమేయం లేకుండా ఎలా వచ్చి పడతాయో, అలాగే సుఖాలు కూడా, మన ప్రమేయం లేకుండా వాటంతటఅవే వస్తాయి. అడగకుండా వచ్చి పడే మేలును కాదనకూడదు. మనం నీటి పక్షులం; ఇతను నేలమీద నివసించే పక్షి- అన్నావు- విను- వజ్రాన్ని అరగదీయాలంటే వజ్రమే కావాలి. నేలపక్షి అయిన చిత్రవర్ణుడిని గెలవటం అనేది మనకు ఈ నేలపక్షి నీలవర్ణుడి సాయం లేకుండా సాధ్యం కాదు. పిరికితనం కొద్దీ మనం ఇప్పుడు ఇతన్ని దూరం చేసుకున్నామనుకో, అతను అలిగి ఆ నెమలి చెంత చేరవచ్చు- అటుపైన మనకు శత్రువును గెలవటం మరింత కష్టం అవుతుంది; పని నెరవేరదు. చెయ్యి దాటిపోయాక 'అయ్యో' అని మొత్తుకోవటం ఆరిపోయిన దీపంలో నూనె పోసినట్లు వృధాయే అవుతుంది- కోరిన కోరిక నెరవేరకపోవటమేకాదు; మనసుకు దు:ఖం మిగులుతుంది.

అందువల్ల, అన్ని విధాలుగానూ మనకు ఈ కాకి స్నేహపాత్రుడే. లేనిపోని అనుమానాలను ఇక కట్టిపెట్టండి- నేను చెప్పినట్లు చేయండి" అన్నది నిశ్చయంగా.

మంత్రి కూడా కొంచెం సంకోచిస్తూ, 'ఇంకా ఎక్కువ మాట్లాడితే ఏమవుతుందో' అని భయపడి, "అన్ని విషయాలూ తెలిసినవారు తమరు. తమకు తెలియని ధర్మాధర్మాలు లేవు. పనుల తీరుతెన్నులు తమరిని మించి తెలిసినవారు లేరు. తమరికి ఎలా తోస్తే అలాగే చేద్దాము. నా ఎరుక ఉన్నంత వరకూ నేను చెప్పాను. యుద్ధ సన్నాహాలు ఎలాగూ మొదలయ్యాయి. కోటకూడా సిద్ధం అయి ఉన్నది. కాబట్టి ఇక ఆలసించక, దూతను రమ్మని, అతను ఎందుకు వచ్చాడో కనుక్కొని పంపించాలి" అన్నది.

(తర్వాత ఏమైందో మళ్ళీ చూద్దాం...) ★



పోరు నష్టం-పొందు లాభం: అంటే, పోట్లాట వల్ల నష్టం, స్నేహం వల్ల లాభం కలుగుతాయని అర్థం.



కోడి గూడు

చాలా కష్టపడి ఇల్లు కట్టుకుని, పిల్లల్ని ఏ కష్టమూ ఎరగకుండా పెంచి పెద్దచేసిన కోడిని దాని పిల్లలు ఎలా చూశాయి..? ప్రతి జానపద కథలోనూ అంతర్గతంగా ప్రవహించే సామాజిక అంశాలు చాలానే ఉంటాయి.. ఇదిగో, ఈ కథ మీకూ తెలిసిందేనేమో, అయినా చదవండి, ఆలోచించండి.

కథనం: యం.కృష్ణవేణి, 7 వతరగతి, ఆర్ఈసీ, మదనపల్లి, చిత్తూరుజిల్లా.

ఒక ఊరిలో ఒక కోడి ఉండేది. ఆకోడి ఎవరిదీ కాదు. ఒక రోజు కోడిగుడ్లు పొదగడానికి అది ఒక అడవిలోకి వెళ్ళింది. అప్పుడు వర్షం పడుతున్నది. కోడి "అయ్యో, వాన పడుతోందే, ఏం చేసేది?" అని బాధపడుతూ కూర్చుంది.

అంతలో ఒక బండి మీద ఇటికల లోడు పోతుంటే చూసింది కోడి. "ఇటికలోడా-ఇటికలోడా, నీకు పుణ్యముంటుంది- నాకు ఒక లోడు ఇస్తావా ? నా గుడ్లు నాని-పోతున్నాయి. నేను ఇల్లు కట్టుకోవాలి" అని అడిగింది వాడిని. "అయ్యో అంతకేనా, ఏం

సర్లేదు తీసుకో" అని ఇటికలోడు ఒక లోడు ఇటికలు వేసి వెళ్లిపోయాడు. ఆ ఇటికలతో కోడి ఇంటి గోడలు లేపింది.

కానీ వానకు గోడలన్నీ నాని పోతున్నాయి. "ఇంకా రెండు లోడులు ఐతే సరిపోతుంది" అని మనసులో అనుకుంది కోడి. అంతలోనే అటు వైపుగా ఒక చెరుకులోడు పోతూ ఉంటే కోడి చూసి, "చెరుకులోడా-చెరుకులోడా, నీకు పుణ్యముంటుంది- ఒక లోడు చెరుకులు ఇస్తావా ? నాగుడ్లు నానిపోతున్నాయి. నేను ఇల్లు కట్టుకోవాలి" అంది. "సర్లే తీసుకో" అని ఒక లోడు చెరుకులు వేసేసి వెళ్ళిపోయాడు చెరుకులాయప్ప. ఆ చెరుకులతో కోడి ఇల్లు సరి చేసుకుంది- కానీ వానకి చెరుకులిల్లు ఇంకా కొద్దిగా నానిపోతోంది.

"ఎలాగబ్బా?" అని ఆలోచిస్తూ కూర్చున్న కోడికి, అంతలోనే ఒక మల్లెపూలోడు కనిపించాడు.

"మల్లెపూలోడా-మల్లెపూలోడా, నీకు పుణ్యం ఉంటుంది- నాకు ఒక లోడు మల్లెపూలు వేస్తావా? నా గుడ్లు నానిపోతున్నాయి; నా ఇల్లు నానిపోతోంది" అంది కోడి. 'సరే'నని మల్లెపూలోడు ఒక లోడు మల్లెపూలు వేసి వెళ్ళాడు. అప్పుడు కోడి ఆ మల్లెపూలతో ఇంటిని చాలా బాగా కట్టింది.

ఇల్లు కట్టాక, కోడి ఆ ఇంట్లో ఇష్టంగా కూర్చొని మూడు గుడ్లను పొదిగింది. పుట్టిన వాటికి ముచ్చటగా మూడు ఆడపిల్లల పేర్లు పెట్టింది. మొదటి ఆమెపేరు ఇటికల ఈరమ్మ, రెండో ఆమె పేరు చెరుకుల చామంతి, మూడో ఆమె పేరు మల్లెల మహరాణి.



ముగ్గురు పిల్లలూ పెద్దయి పెళ్ళి వయస్సుకు

వచ్చారు. అప్పుడు ఒకసారి ముగ్గురు రాజకుమారులు ఆ అడవిలోకి వచ్చారు. వాళ్లకు దాహమై నీళ్ళ కోసం అడవిలో అంతా వెతుకుతున్నారు. ఎక్కడా చిక్కలేదు. ఆ సమయంలో వాళ్ళు ముగ్గురూ సరస్సులో స్నానం చేయటానికి వచ్చిన ముగ్గురు అమ్మాయిలనీ చూశారు.

అప్పుడు రాజకుమారులు ముగ్గురూ 'మమ్మల్ని పెళ్ళిచేసుకొంటారా' అని వీళ్ళు ముగ్గురినీ అడిగారు. ఇటుకల ఈరమ్మ, చెరుకుల చామంతి 'మేము చేసుకొంటాము- మేము చేసుకుంటాము' అన్నారు ఉత్సాహంగా. మల్లెల మహరాణికి కూడా ఇష్టమే అయ్యింది గానీ, "నేను మా అమ్మని అడిగి చెబుతాను" అంది. కానీ ఎంత సేపు చూసినా కోడి రానే లేదు. అప్పుడు పెద్ద రాజకుమారులు ఇద్దరూ ఈరమ్మను, చామంతిని తీసుకొని వెళ్ళిపోయారు. చిన్నరాజు, మల్లెల మహరాణి మాత్రం అక్కడే ఆగారు. మూడు రోజులైనా ఇంకా కోడి రానేలేదు- దాంతో చిన్నరాజు "మళ్ళీ వద్దాంలే" అని మల్లెల మహరాణిని ఒప్పించి తీసుకెళ్ళాడు.

వీళ్లందరూ చిన్నగా ఉన్నప్పుడు వాళ్ళ పెద్దమ్మ వాళ్లందరికీ పెద్ద పూసలదండలు వేసింది. ఇప్పుడు మల్లెల మహరాణి తన దండను తుంచి ఒకొక్క పూసనే దారంట వేసుకుంటూ వచ్చింది- 'ఎప్పటికైనా మాయమ్మ వచ్చి వీటిని గుర్తుపట్టకుండా ఉంటుందా' అని.

ఇంకో వారం అయినాక తిరిగి వచ్చింది కోడి. వచ్చి చూసే సరికి ఏముంది? -ముగ్గురు పిల్లలూ లేరు! కోడి ఇల్లంతా వెతికింది. ఎక్కడా కనబడలేదు. అయితే మల్లెల మహరాణి వేసిన పూసల జాడ పట్టుకొని, వాటిని ఏరుకుంటూ అది వీళ్ళు ఉంటున్న నగరానికి చేరుకున్నది.

అక్కడికి వెళ్ళాక అది ముందు తన పెద్ద బిడ్డ కదా అని ఇటుకల ఈరమ్మ దగ్గరికి వెళ్లింది. ఇటుకల ఈరమ్మ దూరం నుండే చూసి- "అయ్యో! ఇది ఇక్కడికి వచ్చేస్తున్నది! 'మా అమ్మ ఒక కోడి' అని తెలిస్తే నన్ను రాజు తరిమేయకుండా ఉంచుకుంటాడా?" అని

కోడి ఇంకా లోపలికి రాకనే దాని నడుము విరగ కొట్టింది.

అక్కడినుండి కోడి నీళ్ళలో పడి ఈదుకొంటూ చెరుకుల చామంతి దగ్గరకు వెళ్లింది. చెరుకుల చామంతి కూడా దాన్ని దూరం నుండే చూసింది- "అయ్యో! ఇక్కడికే వచ్చేస్తున్నదే! 'మా అమ్మ ఒక కోడి' అని తెలిస్తే రాజు నన్నిక్కడ ఉండనివ్వడు- తరిమేస్తాడు" అని కోడి ఇంకా లోపలికి రాకనే దాని కాళ్ళు రెండూ విరగగొట్టింది.

ఇంక అప్పుడు కోడి కుంటుకుంటూ కుంటుకుంటూ మల్లెల మహరాణి దగ్గరికి వెళ్ళిందిగాని, ఇంకా ఆ మెట్లు ఎక్కకనే క్రింద పడి చనిపోయింది. అంతలో బయటికి వచ్చి చూసిన మల్లెల మహరాణి దాన్ని చూసి ఏడుస్తూ "అయ్యో! నీకెంత కష్టం వచ్చింది" అని దాన్ని ఒక పెట్టెలో వేసి, పైన వ్రేల కట్టింది.

ఆరోజు మధ్యాహ్నం భోజనానికి వచ్చాడు మల్లెల మహారాణి వాళ్ళ భర్త. కానీ దు:ఖంలో ఉన్న మల్లెల మహరాణి భర్తకు తల్లి గురించి ఏమీ చెప్పలేదు. ఆయన నీళ్ళు తాగుతూ పైకి చూశాడు. "ఆ పెట్టె ఏంటి" అని ఆయన మల్లెల మహరాణిని అడిగాడు. ఆమె ఏడుస్తూనే "అవి నేను చిన్నప్పుడు ఆడుకున్న బుడిగీలు" అని చెప్పింది. "ఆ పెట్టెను దించి చూపియ్యి" అన్నాడు రాజు. ఆమె మనసులో "దేవుడా! ఈ పెట్టెలో ఉన్నవి అన్నీ బొమ్మలు అయిపోవాలి" అని కోరుకొంటూ పెట్టెను దించి భర్తకు చూపించింది. చూడగా ఆ పెట్టెలో అన్నీ బుడిగీలు, బొమ్మలూ ఉన్నాయి!

అప్పుడు ఆ రాజు అన్నాడు- "చూశావా, ఈ బొమ్మలే ఇంత బాగుంటే, ఇంక మీ ఇల్లు ఎంత బాగుంటుందో, మీ అమ్మ ఎంత మంచిదో! పద, వెళ్ళి మీ ఇల్లు చూసి వద్దాం. మీ అమ్మను పలకరించి వద్దాం" అని.

"ఏం వద్దు ఏంవద్దు" అని మల్లెల మహారాణి అన్నాకూడా ఆయన వినలేదు. సరేనని ఇద్దరూ కలసి మళ్లీ అడవిలోకి వెళ్తుండగా చీకటి పడింది. ఇద్దరూ అక్కడే ఒక మర్రిచెట్టు కింద పడుకొన్నారు- ప్రొద్దున్నే వెళ్దామని. ఆ ప్రక్కనే ఒక పెద్ద పాము పుట్ట ఉంది. భర్త బాగా

నిద్రపోగానే ఆ రాత్రి మల్లెల మహారాణి లేచి, పుట్టలో చెయ్యిపెట్టింది.



"నన్ను కరిచెయ్యి పామూ! మా అమ్మ లేదు; మా భర్తకి నిజం తెలిస్తే ఉండలేడు" అంటూ. ఆ పుట్టలో ఉండే నాగుపాముకు కొంతకాలంగా ఆరోగ్యం సరిగ్గా లేదు. తల పైన గడ్డలు లేచి చాలా బాధపడుతూ ఉన్నది. మల్లెల మహారాణి చెయ్యి తాకగానే ఆ గడ్డలన్నీ పగిలి పోయాయి. నొప్పి కాస్తా తగ్గిపోయింది.

అప్పుడు పాము పైకి వచ్చి "ఎందుకో బాధ పడుతున్నట్లున్నావు- ఏమిటి, నీ బాధ?" అని అడిగింది. మల్లెల మహారాణి ఆ పాముకు జరిగినది అంతా చెప్పింది. "ఎవ్వరూ తొక్కని ఇసుక మూడు పిడికెలు తీసుకురా" అన్నది పాము. సరేనని, మల్లెల మహారాణి పోయి దగ్గర్లో ఉన్న నదిలోంచి మూడు పిడికెళ్ళ ఇసుక తెచ్చింది.

పాము అన్నది- "వెళ్ళిన వెంటనే ఒక పిడికెడు ఇసుకను మీ ఇంటి మీద చల్లు. అప్పుడు అది ఒక పెద్ద భవనం మాదిరి అవుతుంది. మళ్ళీ రెండో పిడికెడు చల్లు. మీ అమ్మ తిరిగి వస్తుంది. ఇక మీరు తిరిగి వచ్చేటప్పుడు ఆ భవనం మీద మూడవ పిడికెడు ఇసుక చల్లు- ఆ భవనం ఇంతకు ముందు ఎలా ఉంటే అట్లా మారుతుంది" అని. సరే అని మల్లెల-మహారాణి మూడు పిడికెళ్ళ ఇసుకనూ తీసుకున్నది.

తెల్లవారి భర్తతో కలసి తల్లిగారి ఇంటికి వెళ్లినప్పుడు, మల్లెల మహారాణి ముందుగా వెళ్ళి పిడికెడు ఇసుకను ఇంటిమీద చల్లింది. వెంటనే ఆ ఇల్లు పెద్ద భవనంలా మారిపోయింది. రెండవ పిడికెడు చల్లగానే వాళ్ళ అమ్మ తిరిగి వచ్చింది. మల్లెల

మహారాణి, ఆమె భర్త అక్కడ సంతోషంగా ఒక వారం రోజులు గడిపారు. తిరిగి వెళ్ళేటప్పుడు మల్లెల మహారాణి వెనక్కి వచ్చి మూడవ పిడికెడు ఇసుకను ఇంటిమీద చల్లింది. ఇల్లుకాస్తా మునుపటిలాగా మారిపోయింది.

ఇది తెలిసిన ఇటుకల ఈరమ్మ, చెరుకుల చామంతి కూడా వాళ్ళ భర్తలను పిల్చుకు పోయి, ఆ మర్రిచెట్టు క్రిందనే పడుకున్నారు. రాత్రయ్యాక వాళ్ళిద్దరూ పుట్టలో చెయ్యి పెట్టి "మమ్మల్ని కరిచెయ్యి పామూ!" అనగానే, పాము వాళ్ళిద్దరినీ కరిచేసింది!



తోటి పిల్లలతో కలసి ఆటలాడింది సునీత- ఒళ్ళంతా బురద పూసుకున్నది. ఆ తరువాత ఇంటికి పరిగెత్తి పోయి వాళ్లమ్మ ఎదుట నిలబడి "నేనెవరు?" అని అడిగింది.

జోకు!

'ఇదేదో కొత్తఆట' అనుకొని, వాళ్లమ్మ "తెలియడంలేదే! ఎవరమ్మా, నువ్వు?" అన్నది.

"ఆహా, వనితా ఆంటీ చెప్పింది సరిపోయింది! కన్నతల్లి కూడా గుర్తించలేనట్లు ఉన్నానని చెప్పింది!" అన్నది సునీత ఆశ్చర్యపోతూ.



స్నేహం

రచన: సాయి కార్తిక్, 7 వతరగతి, రిషివ్యాలీస్కూల్, మదనపల్లి, చిత్తూరు జిల్లా.

రామాపురపు భూస్వామి రంగయ్య వడ్డీ వ్యాపారం లోను, భూముల మీదను బాగా సంపాదించాడు. ఆ డబ్బుతో ఒక పెద్ద స్థలాన్ని కొన్నాడు. ఆ స్థలంలోనే ఒక సరస్సును, దాని ఒడ్డునే ఒక పెద్ద భవంతిని నిర్మించుకొని, అక్కడ దర్జాగా నివసించటం మొదలు పెట్టాడు.

రంగయ్య భవంతి ప్రక్కనే నివసిస్తుంటాడు, దళితుడు సోమయ్య. రంగయ్యకు సోమయ్యను, అతని కుటుంబాన్ని చూస్తే రోతగా ఉండేది. ఆ కుటుంబాన్ని వెళ్ళగొట్టాలని, ఆ స్థలాన్ని కూడా తానే కొనుక్కోవాలని చాలా సార్లు ప్రయత్నించాడు అతను. కానీ కుదరలేదు. పాపం, సోమయ్యకు ఆ ఇల్లు తప్ప ఇంక వేరే ఏ ఆస్తీ లేదు. "రెక్కల కష్టం చేసుకొని ఎలాగో ఒకలాగా బ్రతికితే, విలువ పెరుగుతున్న భూమిని కనీసం నిలుపుకోవచ్చు" అని వాళ్ళు ఇంటిల్లిపాదీ ప్రొద్దుటినుండి రాత్రి వరకూ శ్రమిస్తూనే

ఉంటారు.

"ఒక మామూలు దళితుడికి అంత గర్వమా? నేను అడిగినా ఇవ్వడా, భూమిని?" అని రంగయ్యకు కోపం.

సోమయ్యను ద్వేషించే రంగయ్య, వాళ్ల కుటుంబంలోని వాళ్ళను ఎవ్వరినీ తన ఆవరణలోకి కానీ, తన సరస్సు దగ్గరకు కానీ రానిచ్చేవాడు కాదు.

రంగయ్య కొడుకు రాము, సోమయ్య కొడుకు రాజు- ఇద్దరూ ఒకే బడికి వెళ్ళేవాళ్ళు. కానీ వేరు వేరు సెక్షన్ల పిల్లలు కావటంతో, ఇద్దరూ ఎప్పుడూ మాట్లాడుకోలేదు. ఒక రోజున వాళ్ళిద్దరూ బడినుండి ఇంటికి తిరిగి వస్తుండగా నీళ్ల కావడి మోసుకొని అటువైపే పోతున్న సోమయ్య కనిపించాడు. ఆ కావడి బరువుకు, వీళ్ళు చూస్తూండగానే సోమయ్య దఢాలున కూలబడిపోయాడు. రాము వెనకనే నడుస్తున్న రాజు గబుక్కున అటుగా పరుగెత్తి, తండ్రిని లేపి కూర్చోబెట్టి, కడవలోని నీటిని త్రాగించాడు.

ఆ సమయంలో రాము వాళ్ళ దగ్గరకు వెళ్ళి పలకరించి, "రాజూ! మీరు మా సరస్సులోని నీళ్ళు తీసుకోవచ్చుకదా? ఎందుకు, ఇంత దూరం నుండి నీళ్ళు మోసుకోవటం?" అని అడిగాడు. సోమయ్య, రాజు ఇద్దరూ నవ్వి ఊరుకున్నారు.

ఆ రోజు సాయంత్రం వాళ్ల నాన్నని అడిగాడు రాము - "రాజు వాళ్ళు మన సరస్సులోంచి నీళ్ళు ఎందుకు తీసుకోరు?" అని.

"వాళ్ళు దళితులు. వాళ్లు మన ఇంటి దగ్గరికి రాకూడదు; మనవి ఏమీ ముట్టుకోకూడదు- నువ్వు కూడా వాళ్ళతో ఏమీ మాట్లాడకూడదు- తెలిసిందా?!" కోపంగా అన్నాడు రంగయ్య. ఆ మాటలు విని రాము చాలా బాధపడ్డాడు. కానీ ఊరుకున్నాడు.

ఒకరోజున రాము స్కూలు నుండి తిరిగి వస్తున్నప్పుడు, దారిలో ఒక పాము కనబడింది. అది అప్పుడే ఒక కప్పను మింగుతున్నది. రాము ఊరుకోకుండా దాన్ని ఒక కర్రతో కలబెట్టాడు. కప్పను వదిలిన పాము ఎంచక్కా రాము వెంటపడింది. ఆ సమయంలో రాము వెనకనే వస్తున్న రాజు వేగంగా కదిలి, పక్కనే

ఉన్న కర్ర ఒకదానితో పామును కొట్టి చంపేసాడు; భయంతో వణికిపోతున్న రాముని ఓదార్చాడు. ఆ రోజునుండి వాళ్ళిద్దరూ మంచి స్నేహితులయ్యారు.



ఇక ఆ నాటి నుండి ఇద్దరూ కలిసి స్కూలుకి వెళ్ళేవాళ్ళు; కలిసి వచ్చేవాళ్ళు. ఎన్నో సార్లు వాళ్ళ నాన్నకు తెలియకుండా తన దగ్గరున్న పుస్తకాలు, పెన్నులు ఇచ్చేవాడు రాము. ఇద్దరూ కలిసి దూరంగా ఓ తోటలో ఆడుకునేవాళ్ళు.

ఒకసారి అట్లా తోటలో ఆడుకుంటున్న పిల్లలిద్దరినీ చూశాడు రంగయ్య. కోపంతో అతని కళ్ళు ఎర్రబడ్డాయి. గబగబా రాముని ఇంటికి లాక్కెళ్ళాడు. సోమయ్యను పిలిపించి పోట్లాటకు దిగాడు. ముందు కొద్దిసేపు తగ్గి ఉన్నాడు సోమయ్య- అటుపైన, అణకువగా ఉంటే కుదరదని గ్రహించినట్లు, అతనూ గొంతు పెంచాడు.

ఇద్దరూ ఒకరిని మించి ఒకరు తిట్టుకోవడం భరించలేకపోయారు పిల్లలిద్దరూ. వాళ్లని ఆపడానికి ప్రయత్నించారు. వాళ్లు ఆవేశంగా పిల్లలని తోసివేసారు. కొద్దిసేపు అట్లాగే నిలబడి, రాము మెల్లగా తోట వైపు నడవటం మొదలెట్టాడు.

అది చూసిన రాజు అతని వెనకనే వెళ్ళాడు. కొద్దిసేపు పోట్లాడుకున్నాక, ఇక్కడ తండ్రులి-ద్దరూ గొడవ చాలించుకున్నారు. చీకటి పడింది; కానీ పిల్లలు మటుకు ఇళ్ళకు రాలేదు.

రంగయ్య, సోమయ్య ఇద్దరూ పిల్లల కోసం కంగారు పడసాగారు. ఊళ్ళోవాళ్ళంతా చేరి రంగయ్యను, సోమయ్యను చీవాట్లు పెట్టారు. అప్పటికప్పుడు దివిటీలు వెలిగించి పిల్లలను వెతకడానికి బయలుదేరారు అందరూ.

రెండు గంటలు గడిచాయి. చంద్రుడి వెలుగులో దూరంగా రెండు ఆకారాలు కనిపించి అందరూ

అటు పరుగెత్తారు. అక్కడ, రాము నడుములోతు బురదలో కూరుకుపోయి కనబడ్డాడు. ఇంకా లోనికి జారిపోకుండా అతని నడుముకు గడ్డితోఅల్లిన త్రాడు ఒకటి కట్టి ఉన్నది. ఆ త్రాడు కొసను పట్టుకొని, బయటికి లాగుతూ అవస్థ పడుతున్నాడు రాజు!



ఊళ్ళోవాళ్ళంతా పరుగున వెళ్ళి, వాడికి సాయం చేసి, రాముని బయటికి లాగారు.

ఆలోగా రంగయ్య అహంకారం తగ్గి, పశ్చాత్తాపం మొదలైంది. 'మేము మనుషులం కాదా?' అని సోమయ్య అడిగిన మాటలు గుర్తుకు వచ్చాయి. తన కొడుకుని కాపాడటం కోసం ఆ పిల్లవాడు-రాజు- పడ్డ శ్రమ కళ్ళముందే కనిపిస్తూ ఉన్నది. 'వాళ్ల మానవత్వం ముందు తనెంత?' అన్న ఆలోచనతో రంగయ్య తల వాలి పోయింది.

"నాన్నా! నేను ఈ రోజు బ్రతికి ఉన్నానంటే, దానికి కారణం రాజు. అతను ఇంతకు ముందు నన్ను పాము కాటు నుండి కాపాడాడు; ఇప్పుడు ఊబిలోంచి కాపాడాడు. కానీ మీరు మాత్రం వాళ్ళని మనుషులుగానే చూడరు. ఎందుకు నాన్నా, ఇలా క్రూరంగా ప్రవర్తిసారు?" అన్నాడు రాము మెల్లగా, అతని దగ్గరకి వచ్చి నిలబడి.

రంగయ్య కళ్ళలో నీళ్ళు వచ్చాయి. "అందరూ నన్ను క్షమించండి బాబూ! అహంకారం కొద్దీ మానవత్వాన్నే మరచాను. ఇంకెప్పుడూ ఇలా చెయ్యను" అన్నాడు.

అనటమే కాదు, తన మాటని నిలుపుకున్నాడు రంగయ్య. అందరితోటీ ప్రేమగా మెలగుతూ 'మంచివాడు' అనిపించుకున్నాడు.

రాము-రాజుల స్నేహం కలకాలం వర్ధిల్లింది. ★



తగ్గిన జ్వరం

రచన: వి.వినయ్‌కుమార్, 8 వతరగతి, z.p.h స్కూల్, పులేటిపల్లి, అనంతపురం జిల్లా.

ఒక ఊరిలో ఒక నాన్న, అమ్మ, అన్న, తమ్ముడు ఉన్నారు. అన్న పేరు పెద్దోడు. తమ్ముడి పేరు చిన్నోడు. అన్న వేరే ఊళ్ళో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చాడు.

ఆ సమయంలో అమ్మకు జ్వరం వచ్చింది. ఎంతకీ తగ్గలేదు. అప్పుడు చిన్నోడు, పెద్దోడు గుడికి పోయి "స్వామీ! మా అమ్మకు బాగైతే నీకు టెంకాయ కొడతాను" అని మొక్కుకున్నారు. ఆ తర్వాత రెండు రోజులకు అమ్మకి జ్వరం తగ్గింది- దాంతో వాళ్ళిద్దరికీ స్వామి మహిమ మీద చాలా నమ్మకం కుదిరింది.

అయితే అంతలోనే వాళ్ల తాత చనిపోయాడు. 'ఈ సమయంలో స్వామికి టెంకాయ కొట్టరాదు' అని చెప్పారు పెద్దలు. దాంతో

చిన్నోడికి, పెద్దోడికి గుడిలో స్వామికి టెంకాయ కొట్టటం వీలవ్వలేదు. అంతలోనే సెలవలు అయిపోయాయి. పెద్దోడు హాస్టలుకు వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఐదు రోజులకు అమ్మకు ఒక ఉత్తరం వచ్చింది- 'నీ కొడుక్కు జ్వరం' అని. కన్న ప్రేగు తల్లడిల్లింది. అమ్మ బయలుదేరుతుండగా పెద్దోడు ఫోన్ చేసాడు- "అమ్మా, నాకు జ్వరం వచ్చింది. అంతకు ముందు నీకు జ్వరం వచ్చినప్పుడు 'స్వామికి టెంకాయ కొడతాను" అని మొక్కుకున్నాను కదా? ఆ మొక్కు నేను తీర్చుకోలేదు. అందుకని స్వామికి కోపం వచ్చింది- రేపు ఆదివారం నాడు నారాయణస్వామికి టెంకాయ కొడితే చాలు- నేను బాగైపోతాను" అని చెప్పాడు.

"సరే" అని అమ్మ , తమ్ముడు ఇద్దరూ భక్తిగా స్వామికి టెంకాయ కొట్టారు. అయినా పెద్దోడికి జ్వరం తగ్గలేదు- ఇంకా హెచ్చయిపోయింది! మరునాడు అందరూ పెద్దోడి హాస్టలుకు పరుగు పెట్టాల్సి వచ్చింది.

"మీ కొడుక్కు జ్వరం అని ఉత్తరం కూడా రాయించాను కదమ్మా? మరి ఎందుకు రాలేదు వెంటనే?" అని అడిగిన వార్డెను గారితో అమ్మ సంగతి అంతా చెప్పింది- "ఆదివారం నాడు స్వామికి టెంకాయ కూడా కొట్టామమ్మా! అయినా జ్వరం తగ్గలేదు ఎందుకనో మరి?" అని.



వార్డెను గారు తల పట్టుకొని చెప్పారు- "అయ్యో! ఇది టెంకాయతో పోయే జ్వరం కాదమ్మా! ఇప్పుడు ఊళ్లో చాలా మందికి విషజ్వరాలు ఉన్నాయి. ఇది కూడా అలాంటిదేనేమో- ఒకసారి పట్నంలో ఆసుపత్రికి తీసుకువెళ్ళి చూపించండి- నయం అవుతుంది.

స్వామి, టెంకాయ అనే ఇంతవరకూ తెచ్చుకున్నారు. ఇంకా వాటిని నమ్ముకొని కూర్చోకండమ్మా" అని.

అమ్మ, చిన్నోడు వెంటనే పెద్దోడిని ఆసుపత్రికి తీసుకుపోయి చూపించారు. "ఇది డెంగు జ్వరం. చాలా ప్రమాదం. ఇంత ఆలస్యం చేసారెందుకు?" అని, ఆసుపత్రివాళ్ళు వాడిని అక్కడే ఉంచుకొని మందులు ఇచ్చారు. రక్తం, గ్లూకోజు ఎక్కించారు. తరువాత కొన్నిరోజులకు పెద్దోడి జ్వరం తగ్గి ఇంటికి వచ్చాడు.

"వార్డెనుగారి మాట విని మంచిపని చేశాం. లేకపోతే పెద్దోడు మనకు దక్కేవాడు కాదు. ఇకమీద ఎప్పుడైనా స్వామికి మొక్కుందాం గానీ, ఆ మొక్కునే నమ్ముకొని ఆస్పత్రికి పోకుండా మటుకు ఉండద్దు" అని నాన్న అమ్మ అనుకున్నారు మనసులో.

కవిత

బుజ్జి పిట్ట

బుజ్జిపిట్ట, బుజ్జిపిట్ట
ఎక్కడికి వెళ్ళావు గబుక్కున
నాకు నువ్వున్నావు
నీకు నేనున్నాను
రోజూ రా! మా ఇంటికి
రోజూ పో! నీ గూటికి
నువ్వు గాలిలో ఆడితే
నేను నేల మీద ఆడతా
ఇద్దరం కలసి హాయిగా ఆడుదాం
కడతా నీకు ఒక గూడు
పెడతా నీకు ఆహారం
బుజ్జిపిట్ట, బుజ్జిపిట్ట
ఎక్కడికి వెళ్తావు గబుక్కున
చూసుకుంటూ నిన్ను అమ్మలా
నీళ్ళు తాపిస్తా తండ్రిలా
ఆడిపిస్తా నిన్ను అన్నలా
ఎత్తుకుంటా నిన్ను చెల్లిలా
బుజ్జిపిట్ట, బుజ్జిపిట్ట
ఎక్కడికి వెళ్తావు గబుక్కున

రచన: వి.ధనుష్, 8వ తరగతి, తేజా విద్యాలయం, కోదాడ, నల్గొండజిల్లా.



పేరు గొడవ

రచన:షేక్ నాగుల్ షరీఫ్, 8 *వతరగతి, అరవింద హైస్కూల్, కుంచనపల్లి, గుంటూరు.*

అనగనగాఒక ఊరు. ఆ ఊరిలో 'దివ్య' అనే అబ్బాయి ఉండేవాడు. ప్రతి ఒక్కరూ వాడిని 'అమ్మాయి పేరు పెట్టుకున్నావ్ ఏంటీ' అని ఎగతాళి చేసేవారు. దివ్య పెద్దగా ఏమీ పట్టించుకునేవాడుకాదు; కానీ వాడి మనసులో మాత్రం 'అయ్యో, నా పేరు ఇట్లా ఎందుకు పెట్టారు? వేరే పేరేదయినా పెట్టిఉంటే బాగుండేది కదా' అనుకునేవాడు. బయటికి మాత్రం 'నా పేరు, నా యిష్టం. నీదేంటిరా?' అని కోపంగా అనేసి పేరు మార్చుకోకుండానే ఉండేవాడు.

వాడికి ఉండే రకరకాల అనుమానాల్లో ఒకటి స్వర్గం గురించి. 'స్వర్గం అంటే ఏమిటి?' అని వాడి డౌటు. ఆ సంగతిని వాడు చాలా మందిని అడిగాడు. వాళ్ళ అమ్మను కూడాను. అమ్మకి వీడు అట్లా ఎందుకు అడుగుతున్నాడో తెలీదు కదా, అందుకని చెప్పింది- 'స్వర్గం చాలా బాగుండే స్థలంరా. అక్కడ ఉన్నవాళ్ళు ఏమీ

కోరుకుంటే అది తక్షణమే జరుగుతుంది' అన్నది. అయితే వీడు అడిగాడు- 'స్వర్గానికి ఎలా వెళ్తారు?' అని. 'చనిపోయాక వెళ్తారురా!' అంది వాళ్ళమ్మ, పెద్దగా ఏమీ ఆలోచించకుండా.

'ఎట్లాగైనా స్వర్గం చూసి రావాలి' అనిపించటం మొదలు పెట్టింది దివ్యకు. "స్వర్గంలో అన్నీ చాలా బాగుంటాయి..ఏవి కావాలంటే అవి వస్తాయి..నా పేరు కూడా, ఏది కావాలంటే అది వచ్చేస్తుంది..ఒక్కసారి వెళ్ళి వచ్చేస్తే సరి.." ఇట్లా అనుకుంటూ వాడు కలల్లో తేలిపోవటం మొదలుపెట్టాడు.

"స్వర్గం వెళ్ళాలంటే చనిపోవాలి. ఆహారం తీసుకోవటం మానేస్తే చనిపోతాం కదా, అప్పుడు స్వర్గం వెళ్ళచ్చు" అనుకొని, వాడు తిండి తిప్పలు మానేశాడు.

మన శరీరానికి ఆహారం చాలా అవసరం. అది లేకపోతే నీరసించి పోతాం. చూస్తూ చూస్తూండగానే దివ్య చాలా నీరసించి పోయాడు. మంచం దిగి నడవలేని పరిస్థితి వచ్చేసింది. వాడి మెదడు కూడా సరిగ్గా పనిచేయటం మానేసింది. ఏవేవే తిక్క తిక్కగా మాట్లాడటం మొదలు పెట్టాడు వాడు.

వాళ్ల అమ్మ వాళ్లకు భయం వేసి, వాడిని డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళారు. డాక్టరు గారు వాడిని పరీక్షించి, "వీడు ఏవేవో ఊహల్లో ఉంటున్నాడు. మన లోకంలో లేడు. వీడికి మంచి ఆహారం ఇచ్చి, అనువైన ప్రదేశంలో ఉంచితే, నాలుగు రోజుల్లో అన్నీ సర్దుకుంటాయి. ఏమీ పరవాలేదు" అని చెప్పారు.

ఆరోజున దివ్య నిద్రపోయి లేచేసరికి వాళ్లంతా "పిల్లల డ్రీమ్ లాండ్" లో ఉన్నారు. "మనం ఎక్కడికొచ్చాం?" అడిగాడు వాడు ఆశ్చర్యంగా. "ఇది పిల్లల స్వర్గంరా" అన్నది వాళ్ల అక్క. దివ్య వాళ్ల అక్క, చెల్లి, స్నేహితులు అందరూ దివ్యని కాపాడటానికి డాక్టరుగారు చెప్పిన విధంగా నటించడం ప్రారంభించారు మరి!

అంతలో ఒక అమ్మాయి వచ్చి, చక్కగా నవ్వి, "స్వర్గానికి స్వాగతం! ఇక్కడ మీరు ఏమంటే అది జరుగుతుంది- ఏది కావాలంటే అది తెచ్చిస్తాం. మీకేది కావాలన్నా నన్ను పిలవండి"

అన్నది. "అందరం స్వర్గానికి వచ్చేశాం" అని ఆనందంతో చిందులేశాడు దివ్య. వెంటనే ఆ అమ్మాయిని పిలిచి, "నా పేరు మార్చుకుంటున్నాను- ఇప్పటినుండి నా పేరు 'హీరో పవన్‌కళ్యాణ్'. సరేనా?" అన్నాడు. "ఓ, ఇక్కడ మీరు ఎలాగంటే అలాగే" అన్నదా అమ్మాయి. అప్పటి నుండి దివ్యను అందరూ 'హీరో పవన్‌కళ్యాణ్' అని పిలవడం మొదలు పెట్టారు.

ఇట్లా ఓ నాలుగు రోజులు గడిచింది. మంచి ఆహారం తినటం వల్ల, దివ్య ఇదివరకటిలాగానే బలంగా తయారయ్యాడు. వాడి మెదడుకు రక్తప్రసరణ సరిగ్గా జరిగింది కూడాను. దాంతో వాడికి వాళ్ల అమ్మానాన్నలు గుర్తుకు రావటం మొదలు పెట్టారు. "అదొక్కటీ వీలవదండి- పిల్లల స్వర్గం కదా, ఇది? దీనికి పిల్లలు మాత్రమే రాగలరు!" అన్నది స్వర్గం అమ్మాయి. అయితే మరునాటికల్లా దివ్య ఇక తట్టుకోలేకపోయాడు- "నాకు ఇవేవీ అక్కర్లేదు- నేను మా అమ్మ దగ్గరికి వెళ్ళాలి" అని ఏడవటం మొదలుపెట్టాడు.

అప్పుడు అతన్ని పరీక్షించిన డాక్టరుగారు నవ్వి, సరేలే, పంపిస్తాం" అన్నారు. అందరూ కలిసి నిద్రపోతున్నవాడిని నిద్రపోతున్నట్లు వాడిని వాళ్ల ఇంటికి చేర్చేశారు మళ్ళీ. వాడు నిద్ర మేల్కొని చూసే సరికి వాళ్ల అమ్మ, నాన్న- అందరూ కనబడ్డారు వాడికి!

"ఏంటిరా, హీరో పవన్ కల్యాణ్! అట్లా చూస్తున్నావేంటి?" అన్నది వాళ్లమ్మ. దివ్యకు సిగ్గు ముంచుకొచ్చింది. నన్ను ఎప్పటిలాగానే 'దివ్య' అని పిలవండి. నా పేరు నాకు చాలా బాగుంది. ఇప్పట్లో పేరు మార్చుకోను" అన్నాడు వాడు. "మరి, స్వర్గంలో వాళ్ళు అట్లా చెప్పారే?" అంది అమ్మ సంతోషంగా నవ్వుతూ. "స్వర్గంలో నాపేరు మార్చుకున్నాను. ఇక్కడ నా పేరు అట్లాగే ఉంచుకుంటాను" అన్నాడు దివ్య, మరింత సిగ్గుపడుతూ.

వాడు బాగైపోయినందుకు వాళ్ల అమ్మావాళ్ళు చాలా సంతోషించారు. వాడంటే ఇష్టం ఉన్న స్నేహితులందరూ అటుపైన వాడిని ఏడిపించటం మానేశారు కూడానూ! ★



మార్కులు

రచన: యోగేశ్వరరెడ్డి, అరవిందాహైస్కూల్, కుంచనపల్లి, గుంటూరుజిల్లా.


మార్కులు, మార్కులు, మార్కులు- ఏంటి, ఈ మార్కులు? వీటితోనే ఎంతోమంది జీవితాలు నాశనం ఐపోతున్నాయి. పరీక్షలలో మార్కులు రాకపోతే తల్లిదండ్రుల తిట్లు తినటం; టీచర్ల ఒత్తిడిని తట్టుకోలేక, ఆరోగ్యాలు పాడుచేసుకోవటం- ఇదేనా, మార్కులు అంటే?

మన జీవితాలో మార్కులు చాలా చిన్నవి. వాటికే అతిగా ప్రాధాన్యత నిచ్చి కష్టాలలో కూరుకుపోతున్నాం, మనం. ఈ మార్కుల పరుగుపందెంలోనే ఓడిపోయి చాలా మంది వాళ్ల బంగారు జీవితాన్ని కోల్పోతున్నారు.

నేను మార్కుల గురించి మీకు చెప్పేది ఒక్కటే: విషయాలను బట్టీ పట్టి, అతి తెలివిని వాడి- కేవలం ఏవో ఎంపిక చేసిన వాటిని మాత్రం చదివి- సంపాదించుకొనేవి మార్కులు.

నిజంగా ఏమీ నేర్చుకోకనే వస్తాయవి. వాటి వల్ల ఏమీ ప్రయోజనం లేదు.

అంతే కాదు- మనం చదివేదాన్ని బాగా అర్థం చేసుకుంటూ చదివితే, మనకు నిజమైన లాభం చేకూరుతుంది. దానితోబాటు మార్కులు వస్తే వస్తాయి కూడా.



కానీ మార్కులు రాకపోతే జీవితంలోనే ఫెయిలు అయినట్లు తిడతారు టీచర్లు, తల్లిదండ్రులు. ఇందుకు ఉదాహరణగా ప్రదీప్ గురించి చెబుతాను మీకు-

ప్రదీప్ ఒక తెలివైన కుర్రవాడు. చాలా బాగా చదువుతాడు. కానీ ఏం ప్రయోజనం? ఆ మార్కులన్నీ బట్టీ పట్టి తెచ్చుకున్నవే. మంచి మార్కులు వస్తున్నాయి; కానీ వాడు దేన్నీ నిజంగా అర్థం అయితే చేసుకోవడం లేదు. ఎంత గొప్ప ర్యాంకర్ అయినా సరే, అర్థం చేసుకోకపోతే చివరకు ఎందుకూ పనికిరాడు. అలాగే ప్రదీప్ కూడా పెరిగి పెద్దవాడైపోయాడు; ఉద్యోగం కోసం వెతకడం మొదలు పెట్టాడు. ఒక కంపెనీ ఇంటర్వ్యూకి ఛాన్స్ ఇచ్చింది. ప్రదీప్‌కి వచ్చిన మార్కులు వాళ్లకు నచ్చాయి- కానీ ఏం లాభం? వాళ్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయాడు ప్రదీప్.

ఎందుకంటే - మనం దేన్నయినా బట్టీ కొట్టామనుకోండి, అట్లా బట్టీ కొట్టిన విషయం మహా ఉంటే రెండు రోజులు- లేదా మూడు రోజులు- మాత్రమే ఉంటుంది మన మెదడులో. ఆ తరువాత అది మనకు ఇక జ్ఞాపకం ఉండదు. కానీ అర్థం చేసుకుంటే మటుకు అలా కాదు: మార్కులు వస్తే వచ్చె;రాకపోతే పోయె, కనీసం జ్ఞానం మటుకు వస్తుంది. వస్తే గిస్తే ఏదో ఒక ఉద్యోగం కూడా సంపాదించుకోవచ్చు. కాబట్టి మార్కులు ముఖ్యం కాదు.

మన జీవితం ఒక ఆట. అందులో మార్కులు ఒక అయిదు శాతం మాత్రమే. మిగతా తొంభై

ఐదు శాతం 'చదువు, తల్లిదండ్రులు, టీచర్లు, మంచి భావ వ్యక్తీకరణ, సమాజంలో గౌరవం, మనలోని ప్రత్యేకత' ఇలాంటివి ఎన్నో ఉంటాయి. అయినా కేవలం ఐదు శాతం ఉండే ఈ మార్కులు మనల్ని ప్రతిక్షణం నరకంలోకి నెడుతుంటాయి.

ఉదాహరణకు- ఇప్పుడు మీరు పదవ తరగతి చదువుతున్నారు. మీ తల్లిదండ్రులు, టీచర్లు "మంచి మార్కులు తెప్పించుకో, తెప్పించుకో" అని మీ పై చాలా ఒత్తిడి తెచ్చి పెట్టారు. అట్లాంటప్పుడు మీరు ఎంత బట్టీ పట్టి చదివినా ప్రయోజనం ఉండదు. అయినా అట్లా చదివి, పరీక్షలు రాసి, చాలీ చాలని మార్కులతో మీ తల్లిదండ్రుల ముందర, టీచర్ల ముందర నిలుచుంటారు. వాళ్ళు అనే మాటలకు మీకు ఒక ఫీలింగ్ కలుగుతుంది- మార్కులు పోయినందుకు మీ జీవితమే పోయినట్లు అనిపిస్తుంది: అంతే, ఇంక మీరు ఖచ్చితంగా అస్సలు చదవనే చదవరు.

నేను మీకందరికీ చెప్పేదేంటంటే, ఒక ఆశయం తీసుకొని, ఆ ఆశయాన్ని చేరేవరకు పట్టుదల వీడకుండా కృషి చేయాలి మనం. ఎప్పటికప్పుడు విషయాల్ని అర్థం చేసుకోవాలి తప్ప, ఊరికే బట్టీ కొట్టకూడదు.



మార్కుల జోలికి అస్సలు వెళ్ళకండి- ఎందుకంటే అవి మన ఏకాగ్రతను పోగొడతాయి. ఒక్కసారి మార్కుల గురించి పట్టించుకున్నావంటే చాలు- అంతే, ఇంక నువ్వు బాగా రాయలేవు. మొదట నువ్వు మంచిగా చదువు- ఆ తరువాత నువ్వు వద్దన్నా మార్కులు నీ వెంట వస్తాయి.

ఇప్పుడు ఉన్న పరిస్థితులలో విద్య అనేది ఒక వ్యాపారం అయి కూర్చున్నది. ఉదాహరణకు,

అన్ని బడులలోను ఏడవతరగతి పరీక్షలకోసం విద్యార్థులను చదివిస్తారు. ప్రతి ఒక్కరి దగ్గరా "ఆల్ ఇన్ వన్" గైడ్ ఉంటుంది. అది చూడడం-బట్టీకొట్టడం; చూడటం -బట్టీకొట్టడం; అంతే. చివరికి ఇంగ్లీషు, తెలుగు, హిందీ, సైన్స్ అన్నీ బట్టీ కొట్టటమే. భాషలన్నీ చక్కగా చదివి అర్థం చేసుకుంటే వచ్చేస్తాయి. కానీ భాషలను కూడా బట్టీ కొట్టేస్తారు. పరీక్షలు పూర్తి అయిపోయాక, బడులన్నీ ఇంక వాళ్ళ ఆయుధాల- (అంటే టి.వి!)- దగ్గరికి వెళ్తాయి. వెళ్ళి, సిగ్గు లేకుండా "మాకు మార్కులు ఇన్ని వచ్చాయి; ఫలానా స్కూల్లో చేరకండి; మా స్కూల్లో చేరండి" అని ప్రచారం చేసుకుంటాయి. పాపం అమాయక తల్లిదండ్రులు- వాళ్ల పిల్లలను ఆ స్కూళ్ళలోనే చేర్పించి వాళ్ళ జీవితాలను 'మార్కులు' అనే దుష్ట శక్తితో నింపుతున్నారు.

తల్లిదండ్రులారా, ఏ స్కూల్ గురించయినా సరిగ్గా తెలుసుకోకుండా మీ పిల్లలను ఆ బడిలో చేర్చకండి. మీ బంగారు పిల్లల జీవితాల గురించి కూడా ఆలోచించండి: ఏదైనా ఒక కొత్త వంటకం తయారు చేస్తున్నారంటేనే మీరు చాలా జాగ్రత్తగా ఉంటారే, మరి మీ పిల్లలను ఏదైనా బడిలో చేర్చాలన్నప్పుడు మీరు ఒకటికి పది సార్లు ఆలోచించి మరీ నిర్ణయం తీసుకోవాలి. మన పసిపిల్లలను 'మార్కులు' అనే దెయ్యం బారి నుండి మనమే విడిపించుకోవాలి.

'వీడెవడో మార్కుల గురించి ఇలా రాశాడు; వీడు వాడి క్లాసులో ఒక చదువురాని వాడు అయి ఉంటాడు" అని మాత్రం అనుకోకండి. నేనూ చదువుతాను; కానీ నాకు మార్కులు మాత్రం అంతగా నచ్చవు. అర్థం చేసుకోకుండా మార్కుల కోసమని చదివే చదువు నాకు అస్సలు నచ్చదు.

పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే ఓ తల్లిదండ్రులారా, మీరు దయచేసి పిల్లల పై 'మార్కులు'అనే ఒత్తిడిని తీసుకురాకండి.

చివరగా టీచర్లకు నా విన్నపం- మార్కులను పిల్లలకు దూరంగా ఉంచండి. వాళ్ళకి నిజంగా ఎంత అర్థమైందో తెలుసుకొనేందుకు ప్రయత్నం చేయండి. పిల్లల్ని మార్కులతో కొలవకండి. ★



దేవునికి కానుక

రచన: శ్రీమతి ఆదూరి హైమవతి, విశ్రాంతప్రధానోపాధ్యాయిని, బెంగళూరు.

విదేశాల్లో ఉంటున్న మనవడు వివేక్ తాతగారిని చూడాలని భారతదేశానికి వచ్చాడు. తాత సదానందంలో ఉత్సాహం ఉరకలు వేస్తున్నది. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు.

మనవడు వివేక్‌కి పదమూడేళ్ళు. విదేశంలోనే పుట్టినా తెలుగుదనాన్ని పుణికి పుచ్చుకున్నాడు వాడు. దేశమంటే ప్రేమ, పెద్దలంటే గౌరవం, తాత అంటే అభిమానం, చక్కని చదువు- ఏ తాతకైనా అంతకంటే ఏం కావాలి? అందుకే, మనవడి పుట్టిన రోజునాడు వాడి పేరిట తమ ఊర్లో ఉన్న అన్నిఆలయాల్లోనూ పూజలు చేయించాలని సంకల్పించాడు సదానందం. వంటవాళ్ళనుపిలిపించి పది రకాల 'తీపులు' చేయించాడు; పదిరకాల పండ్లు తెప్పించాడు;

కంచినుండి పట్టుచీరలు, పట్టుపంచెలు తెప్పించి, అన్ని ఆలయాల్లోనూ దేవుళ్ళకు సమర్పించాలని నిశ్చయించాడు.

అన్నీ కార్లో సర్దుకుని బయల్దేరాడు మనవడితోకల్సి. "నాయనా! వివేక్ ! ఎంతో కాలంగా అనుకుంటూ ఉన్నానురా, నీ పుట్టినరోజునాడు మన ఊర్లో ఉన్న అన్ని దేవాలయాల్లోను అర్చన చేయించాలని. కానీ మీరేమో అక్కడెక్కడో ఉంటిరి! ఇన్నాళ్లకు నా కోరిక తీరుస్తున్నావు- సంతోషంగాఉందిరా ! ముందుగా మనం వెంకటరమణుని ఆలయానికి వెళ్ళి అర్చన చేయిద్దాం. ఆ తర్వాత మిగిలిన ఆలయాలకు వెళదాం.." అంటూ తమ ఊళ్ళో ఉన్న గుడుల విశేషాలు చెప్పసాగాడు సదానందం.

ఊళ్ళో జనాలందరూ రోడ్డుమీదే ఉన్నట్లున్నారు; కారు మెల్ల మెల్లగా పోతున్నది. చలి వణికిస్తూన్నది. ఉదయం పదిగంటలైనా ఇంకా మంచు పూర్తిగా వదలనే లేదు. అంతలో ఒక ముసలివాడెవరో కారుకు అడ్డం వచ్చినట్లుంది, డ్రైవరు అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. ముసలాయనకి చొక్కా లేదు. చినిగిపోయిన పాత పంచె ఒకటి కట్టుకొని ఉన్నాడు. చలికి వణుకుతున్నాడు. "క్షమించండి బాబూ, చూసుకోలేదు" అంటూ రోడ్డు ఆవలికి నడిచి పోతున్నాడు.

అప్పుడు చూశాడు వివేక్. చాలా మంది ముసలివాళ్ళు, ముతకవాళ్ళు రోడ్డుమీద అక్కడక్కడా కూర్చొని ఉన్నారు- కొందరు ఏవేవో చిన్న చిన్న సామాన్లు అమ్ముతున్నారు. కొందరు ఊరికే అడుక్కుంటున్నారు. ఎవ్వరికీ ఒంటిమీద సరైన బట్టలు లేవు. చలికి అందరూ వణుకుతున్నారు. అయినా ఎవరి పనిలో వాళ్ళున్నారు.


"తాతయ్యా, ఇక్కడ చాలామంది తాతలు ఉన్నట్లున్నారే, కానీ ఎవ్వరికీ చలి పుడుతున్నట్లు లేదు?" అడిగాడు వాడు, తాతయ్యని.

సదానందం అన్నాడు- "కాదురా, వాళ్లని చూసుకునేందుకు ఎవ్వరూ లేరు. అందునా ముసలివాళ్ళు కదా, బరువు పనులేవీ చేయలేరు. ఏదో ఇట్లా బ్రతుకుతున్నారంతే. వాళ్లకున్న కష్టాలముందు ఈ చలి ఏపాటి?"

అని.

వివేక్ ఏమీ అనలేదు. కొద్దిసేపటికి "తాతగారూ! కారు ఆపించండి, ఓసారి" అని చెప్పడంతో డ్రైవర్ కారు ఆపాడు. వివేక్ గబగబా కారుదిగి, డిక్కీలో ఉన్న పండ్ల బుట్ట , కొత్త బట్టలు ఉంచిన సంచీ చేతపట్టుకొని వెనక్కి నడవటం మొదలు పెట్టాడు. వీధి ప్రక్కన ఉన్న ముసలి వాళ్లందరికీ ఆ కొత్తచీరలు, పంచెలు, బుట్టలోఉన్న పండ్లు పంచి ఇవ్వటం మొదలుపెట్టాడు!

సదానందం కారులోనే కూర్చొని మనవడిని చూస్తూ ఉండిపోయాడు.



అక్కడి ముసలివాళ్లంతా విస్తుపోతున్నారు; కంగారు పడుతున్నారు- "బాబూ ! తమరెవరు? ఇంత ఖరీదైన బట్టలు మాకు ఇస్తున్నారే, మీ పెద్దవాళ్లు కోపగించు-కుంటారేమో! మాతో పోట్లాడతారేమో! ఇంతకీ తమరెవరు బాబూ?" అని భయం భయంగా అడుగుతున్నారు వాళ్ళు.

"నేను సదానందంగారి మనవడిని. మా తాతగారు చాలా మంచివారు. మీకు ఇవన్నీ ఇచ్చినందుకు ఏమీ కోపగించుకోరు. దేవునికి చాలా బట్టలుంటాయి. ఆయనకు కావాలన-గానే ఇచ్చేవాళ్ళు కూడా చాలా మందే ఉన్నారు. 'అయినా వీళ్లంతా ఇక్కడ చలికి వణుకుతూ ఉంటే, నాకు మాత్రం కొత్త బట్టలు తెచ్చావేంటి?' అని దేవుడు నన్ను తిడతాడు-ఎందుకు, అట్లా అవ్వటం? ఇంద తీసుకోండి, ఈ తీపులన్నీ తినండి చక్కగా" అంటూ తను తెచ్చిన తీపులన్నిటినీ పూర్తిగా ముసలి-ముతకలకు పంచేశాడు వివేక్.

అన్నీ పంచాక, ఖాళీ బుట్టలు-సంచులతో వచ్చి కార్లో కూర్చుని "తాతగారూ ! మీకు కోపం

రాలేదు కదా, నన్ను క్షమిస్తారా ? మిమ్మల్ని అడక్కుండానే అన్నీ ఇట్లా పంచేశాను- పాపం వాళ్లని చూస్తే జాలి వేసింది మరి " అని అడిగాడు వివేక్.

అప్పటివరకూ మనవడు చేసిన పని గురించే ఆలోచిస్తున్న సదానందం సంతోషంగా నవ్వాడు- "నువ్వు చేసిన పని చాలా గొప్పదిరా! నాకు కోపం ఎందుకు వస్తుంది?! సంపదలు ఉన్నా, లేకున్నా మనం అందరం ఆ భగవంతుని బిడ్డలమే. అవసరంలో ఉన్న తన బిడ్డలకు సాయంగా ఇవన్నీ అందించినందుకు కరుణా-మయుడైన ఆ భగవంతుడు చాలా సంతోషించి ఉంటాడు; మనల్ని దీవిస్తాడు. నిజం! అయితే నాకు కాస్త చిన్నతనంగా ఉందిరా- '13 ఏళ్ళున్న నీకు తట్టిందే, ఈ విషయం- అది ఇన్నేళ్ళుగా నాకెందుకు తట్టలేదు?' అని సిగ్గుగా ఉంది.

పద, ఇక ఆ భగవంతుడిని దర్శిద్దాం. నీ మంచి మనసు ఇప్పుడు చేసిందే, అర్చన- అది ఈ మధ్యకాలంలో ఆయనకు చాలా సంతోషాన్నిచ్చిన కానుక అయి ఉంటుంది!" అంటూ కారును ముందుకు పోనిమ్మని చెప్పాడు సదానందం. ★

డాక్టరు, లాయరు!

జోకు

రాహుల్, రాణి ఏం ఆట ఆడుదామా అని ఆలోచిస్తున్నారు.

రాహుల్: డాక్టర్ ఆట ఆడుకుందామా?

రాణి: చాలా బాగుంటుంది- నువ్వు ఆపరేషన్ చెయ్, నేను కేసు పెడతాను!

ఇనప మనిషి!

కస్టమర్: శరీరంలో ఐరన్ లోపించిందన్నాడు డాక్టరు..ఇనుము ఎక్కువగా ఉండేవి ఏమున్నాయ్?

సర్వర్: దోసెల పెనం, బాణలి..ఇంకా వేరేవి గుర్తురావట్లేదు సార్!



న్యాయమూర్తి ఎంపిక

రచన: విష్ణుభొట్ల రామకృష్ణ, రామకృష్ణాపురం, విజయవాడ. *సవరణ: కొత్తపల్లి.*

వైజయంతీ పురాన్ని జయంత మహారాజు పరిపాలించే కాలంలో సుబోధుడు అనేవాడు న్యాయాధికారిగా ఉండేవాడు. పక్షపాతం అంటూ లేని సమాధానం కావాలంటే సుబోధుడి దగ్గరికే వెళ్ళాలని రాజ్యంలో అందరూ అనుకునేవాళ్ళు. అయితే అట్లాంటి సుబోధుడు అకస్మాత్తుగా చనిపోవటంతో రాజుగారికి పెద్ద కష్టమే వచ్చిపడ్డట్లయింది.

సుబోధుడి స్థానాన్ని భర్తీ చేయటంకోసం రాజుగారు పెద్ద వ్రాత పరీక్ష ఒకదాన్ని నిర్వహించారు. అందులో నెగ్గిన యువకులకు అనేక పోటీలు నిర్వహించారు. ఆ పోటీలు అన్నిటిలోను రామశాస్త్రి, కృష్ణశాస్త్రి అనే ఇద్దరు యువకులు సమానంగా నెగ్గారు.

"మరి ఈ ఇద్దరిలోనూ ఎవరిని ఎంపిక చేసుకోవాలి?" అనేది ఎంత ఆలోచించినా

తేల్చుకోలేకపోయారు రాజుగారు. చివరకు ఆయన మంత్రి శ్రీకాంతుడిని పిలిచి, "మంత్రివర్యా, ఎన్ని విధాలుగా చూసినా 'వీళ్ళ శక్తి యుక్తులు సమానం' అనే తోస్తున్నది. కానీ వీళ్ళను జాగ్రత్తగా గమనించండి. అటుపైన న్యాయమూర్తి పదవికి వీళ్లలో ఒకరిని ఏమైనా ఎంపిక చేయగలరేమో, చెప్పండి" అన్నాడు.

మంత్రి శ్రీకాంతుడు సుబోధుని మిత్రుడు; వృద్ధుడూనూ. ఆయన రామశాస్త్రిని, కృష్ణశాస్త్రిని పిలిచి "నాయనలారా, మీరిద్దరూ నాలుగు రోజుల పాటు ఆస్థానానికి రావాలి. పరిపాలనలో తలెత్తే సమస్యలు ఎన్ని విధాలుగా ఉంటాయో తెలుసుకోవాలి. అటుపైన రాజుగారు తన నిర్ణయాన్ని మీకు తెలియజేస్తారు. అంతవరకూ మీకు ప్రత్యేకంగా ఏలాంటి బాధ్యతలూ ఉండవు. కేవలం మాతో పాటు రోజూ కొలువుకు రావటం, అంతే" అన్నాడు.

రామశాస్త్రి "సరే" అన్నాడు. "ఓహో! ఇంకా కొన్ని పరీక్షలు ఉంటాయన్నమాట! అంటే మా యిద్దరిలోనూ సరైన వాళ్ళెవరో ఇంకా తేల్చుకోలేక పోయారన్న మాట, రాజుగారు!" అన్నాడు కృష్ణశాస్త్రి.

శ్రీకాంతుడు చిరునవ్వుతో "అవునవును, సరిగ్గా కనుక్కున్నారు" అన్నాడు.



మరునాడు ఆయన వాళ్ళిద్దరినీ ఆస్థానంలోని ఉద్యోగులకు పరిచయం చేశాడు. "నమస్కారం" అని ఊరుకున్నాడు రామశాస్త్రి. "మేం ఇంకో మూడు నాలుగు రోజులు ఉంటాం. మీ సమస్యలు ఏవి ఉన్నా చెప్పండి. మా తెలివితేటలతో వాటిని పరిష్కరిస్తాం" అన్నాడు కృష్ణశాస్త్రి అందరితోటీ.

ఆ రోజూ, తర్వాతి రోజు కూడాను ఆస్థానంలో

ఉద్యోగులు చాలా మంది వీళ్ళిద్దరినీ కలిసి తమకు తోటి వారంటే ఉన్న అక్కసును, పరిపాలనలో తమకు నచ్చని విషయాలనూ ప్రస్తావిస్తూ వచ్చారు. కృష్ణశాస్త్రి వాళ్ళను మెచ్చుకొని ఏదేదో మాట్లాడుతూ వచ్చాడు. అయితే అక్కడే కూర్చొని ఉన్న రామశాస్త్రి మాత్రం అప్పుడప్పుడూ చిరునవ్వు నవ్వటం, కొద్దిపాటి సాంత్వన వచనాలు పలకటం మినహా ఆ చర్చల్లో పెద్దగా పాలు పంచుకోలేదు.

నాలుగవ రోజున మంత్రి శ్రీకాంతుడు రాజుగారిని కలిసి "మహారాజా! రామశాస్త్రినే మన ఆస్థానానికి న్యాయాధిపతిగా నియమించండి. ఆ పదవికి తగిన వ్యక్తి అతనే " అని సిఫార్సు చేశాడు.

రాజుగారు చిరునవ్వు నవ్వి, అడిగారు- "మంత్రివర్యా! వీళ్ళిద్దరూ విద్యాధికులే; అన్నింటా సమానమే అనిపించారు కదా, మరి రామశాస్త్రిని ఎలా ఎంపిక చేసారు?" అని.

"మహారాజా! వీళ్ళ తెలివితేటలు, పాండిత్యం సమానం అయినా ఇద్దరి వ్యక్తిత్వాలలోనూ చాలా వ్యత్యాసం ఉన్నది. రామశాస్త్రి మితభాషి. కొలువుకు వచ్చిన మూడు రోజులూ అతను అన్ని విషయాలనూ మౌనంగా గమనిస్తూ వచ్చాడు. ఇక కృష్ణశాస్త్రి- ఇతరుల సమస్యల్ని పరిష్కరించే పెత్తనాన్ని ముందుగా తన నెత్తిమీద తాను వేసుకున్నాడు: దానికి ప్రభువుల వారి సమ్మతి ఉన్నదో లేదో చూసుకోలేదు. అటు తర్వాత, ఇక అత్యుత్సాహవంతులైన సభికులు కాలహరణం కోసం చెప్పే చాడీలను వినటం; అతిగా మాట్లాడటం- చేసి, పదిమందిలోనూ పలచన అయ్యాడు.

న్యాయాధిపతిగా నియమితుడైయ్యే వ్యక్తికి తెలివితేటలు, శాస్త్ర పాండిత్యం ఉంటే చాలదు- నిజమైన పెద్దరికం ఉండాలి. 'చాడీలు వినటం, అతిగా మాట్లాడటం' వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. కాబట్టి, మహారాజా! రామశాస్త్రికే న్యాయాధిపతిగా ఉండేందుకు తగిన అర్హత ఉన్నది" వివరించాడు శ్రీకాంతుడు.

మంత్రిగారి ఎంపికను రాజుగారు సంతోషంగా ఆమోదించారు. రామశాస్త్రిని న్యాయాధికారిగా నియమించారు. ★



ఎవరికోసం?

మనం చదువుకునేది ఎవరికోసం? ఈ ప్రశ్నకి సమాధానం ఆలోచించుకోవాలి, మనం అందరమూనూ..
రచన: టి.శ్రీవల్లీరాధిక, హైదరాబాదు.

కమల, విమల అక్కచెల్లెళ్ళు.

ఒకరోజున అమ్మ వాళ్ళిద్దరినీ పిలిచి, వాళ్ళు రాసిన నోటు పుస్తకాలను చూపించమన్నది. "అయ్యో! మీ చేతి రాత కొంచెం గందరగోళంగానే ఉందే! చూచి రాత రాయండి, ఓ ఇరవై ఐదు వాక్యాలు. దస్తూరీ బాగవుతుంది" అన్నది.

వాళ్ళిద్దరూ రాసి చూపించారు. అమ్మ వాళ్లను మెచ్చుకుని, "రోజూ ఇట్లాగే శ్రద్ధగా రాశారంటే, ఒక్క నెల రోజుల్లో మీ చేతివ్రాత చాలా అందంగా తయారవుతుంది. రాస్తారుగా?!" అని అడిగింది.

"ఓ! తప్పకుండా రాస్తాం అమ్మా!" అన్నారు కమలా, విమలా.

"అయితే ప్రతిరోజూ ఇంటికి రాగానే మీరిద్దరూ హోంవర్క్ పూర్తి చేసుకుని, చూచివ్రాత వ్రాసి, రాత్రి అన్నం తినే ముందుగా నాకు చూపించాలి. ఇట్లా ఒక నెల రోజులు చేయాలి- సరేనా?" అన్నది అమ్మ. ఇద్దరూ తల ఊపారు.

అటుపైన ఇద్దరూ ప్రతిరోజూ వాళ్ళ అమ్మ చెప్పినట్లుగానే ఇరవై అయిదు వాక్యాలు రాసి, ఆమెకు చూపించేవాళ్ళు. మొదట్లో ఒక నాలుగు రోజులపాటు ఆమె వాటిని శ్రద్ధగా చూసింది; తప్పులుంటే సరి చేసింది; బాగా రాస్తే మెచ్చుకున్నది- తర్వాత, అయిదో రోజున కమల, విమల పుస్తకాలు తీసుకుని వెళ్ళేసరికి ఆవిడ ఏదో చదువుకుంటూ ఉంది: "ఓహో, తెచ్చారా! సరే- అక్కడ పెట్టండి- తర్వాత చూస్తాను" అన్నది. వాళ్ళిద్దరూ పుస్తకాలని అమ్మ దగ్గర- బల్ల మీద పెట్టి, వచ్చేశారు.

అయితే మరునాడు వాళ్ళు బడినుంచి వచ్చేంతవరకూ ఆవిడ ఆ పుస్తకాలని అసలు చూడనేలేదు.

పుస్తకాలు తీసుకుని, ఆరోజు కూడా ఇరవై అయిదు వాక్యాలు రాశారు వాళ్ళు. ఆ తర్వాత ఎప్పటి లాగానే వాళ్ళు పుస్తకాలు తీసుకువెళ్ళి అమ్మకి చూపిస్తే, ఆమె ఏదో వ్రాసుకుంటూ- "అక్కడ పెట్టి వెళ్ళండి" అని చెప్పింది.



ఇట్లా మరో నాలుగు రోజులు గడిచాయి

ఆరోజున ఇద్దరూ కూర్చుని రాయడం మొదలు పెట్టారు: కమల అందంగా, శ్రద్ధగా రాస్తూంటే, విమల మటుకు హడావుడిగా రాసేసి, 'టి.వి' చూసేందుకు వెళ్ళిపోయింది. 'అదేమిటి?' అని కమల అడిగితే- "అమ్మ

చూడటమే లేదు కదా!" అంది విమల.

"ఒకవేళ చూస్తే?" అంది కమల.

"చూడదు. ఒకవేళ చూస్తే, 'ఇవాళ వేలు బాగాలేదు' అని చెప్తాను- 'రేపట్నుంచీ బాగా రాస్తాను' అని చెప్తాను" అంది విమల.

విమల చెప్పిందే నిజమయింది. వాళ్ళ అమ్మ ఆరోజు కూడా పుస్తకాలు చూడనేలేదు.

అయినా కమల మాత్రం శ్రద్ధగా రాస్తూనే ఉంది రోజూ. విమల మాత్రం ప్రతిరోజూ ఎలాగో ఒకలా పేజీ నింపేసి, పుస్తకాన్ని ప్రక్కన పడేసి వెళ్ళిపోతోంది.



పదిహేను రోజుల తర్వాత ఒకరోజున... అమ్మ వాళ్ళిద్దరినీ పిలిచి, ఆరోజు రాసిన వాక్యాలు చూపించమంది. కమల-విమల ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

రెండు పుస్తకాలనూ ప్రక్క ప్రక్కన పెట్టి, "మొదటి రోజు రాసిన వాక్యాలనీ, చివరి రోజు రాసిన వాక్యాలనీ పరీక్షగా చూడండి" చెప్పింది అమ్మ ఇద్దరికీ.

పుస్తకాల మొదటి పేజీని, చివరి పేజీని చూసిన కమల, విమల ఇద్దరూ ఆశ్చర్యపోయారు: కమల మొహం ఆనందంతో వెలిగిపోతే, విమల మొహం వాడిపోయింది.

కమల పుస్తకంలోని వాక్యాలు మొదటిరోజున రాసిన వాటికన్నా ఎంతో అందంగా- చక్కని ముత్యాల్లాగా ఉన్నాయి.

ఇక విమల పుస్తకంలోని వ్రాత మొదటిరోజుకంటే అందంగా లేదు సరికదా, అసహ్యంగా- అసలు చదవడానికే అర్థం కాకుండా ఉంది.

'ఎవరూ చూడనప్పుడు, ఎలా రాస్తే మటుకు ఏముంది?" అన్న విమల నిర్లక్ష్యమే అందుకు

కారణం.

అమ్మ ఏమైనా అనటానికి ముందే తను చేసిన తప్పు అర్ధమయింది విమలకు.

“రోజూ ఇరవై అయిదు వాక్యాలు రాయాలని నేను మీకు చెప్పిందీ, మీరు ఒప్పుకున్నదీ ఎందుకోసం? మీ చేతివ్రాత బాగవడం కోసం. నేను ప్రతిరోజూ 'చూడటం-చూడకపోవడం' తో దానికి సంబంధం ఉండనక్కర్లేదు. ఒకరు పరీక్షించినా-పరీక్షించకపోయినా, మనం చేయవలసిన పనిని- మనం చేస్తామని ఒప్పుకున్న పనిని- శ్రద్ధగా చేస్తూనే పోవాలి. తెలిసిందా?!" ఆడిగింది అమ్మ.

"తెలిసిందమ్మా, అలా చేయకపోతే నష్టం మనకేనని కూడా అర్ధమయింది" అంది విమల.

“పరీక్ష చేయనట్టు కనిపించినా అమ్మ పరీక్ష చేస్తూనే ఉంటుందనీ, 'అసలు అదే ఒక పరీక్ష' అని కూడా అర్ధమయింది” అంది కమల.

వాళ్ళ అమ్మ నవ్వి "ఇద్దరూ గుర్తుపెట్టుకోండి ఈ రెండు పాఠాలనీ" అంటూ చెరొక పెన్నూ బహుమతిగా యిచ్చింది.





కోడి పెంపకం

మనుషులు కోళ్ళను పెంచటం చూశాం. కోళ్ళు పురుగుల్ని పెంచటమే, చూళ్ళేదు. కోడి పిల్ల ముచ్చటపడి పురుగుల్ని పెంచితే ఏమౌతుంది? -ఇదిగో, ఈ కథలోలాగా అవుతుంది...

రచన: నారాయణ, కొత్తపల్లి బృందం

ఒకసారి ఒక తల్లి కోడి గింజలు ఏరుకుంటూ ఉంది. దాని పిల్లలు దాని వెంటే తిరుగుతున్నై, అది ఏ పని చేస్తే ఇవి కూడా అదే పని చేస్తున్నై.

తల్లి కోడి కాళ్లతో నేలను గీరి, పిల్లలకు చూపించింది. అవి కూడా తమ సన్న సన్న కాళ్లతో నేలను గీరి, తల్లి గీరిన చోటికి పరుగెత్తి మూగి చూశాయి. తల్లి గీరిన చోట వాటన్నిటికీ తలా ఒక చిట్టి పురుగు దొరికింది.

పిల్లల్లో తెలివైన దొకటి ఉంది. అది అడిగింది - "అమ్మా, మనం యీ పురుగుల్ని దాచుకుంటే నేమి? అవి పిల్లల్ని పెడతాయి కదా, ఎక్కువౌతాయి! అప్పుడు మనం వాటిని

తింటూ ఉండచ్చు ఎంచక్కా!" అని.

తల్లి నవ్వింది, "పోయిన జన్మలో నువ్వు మనిషివి అయి ఉంటావు. ఊరుకో! మనం ఎక్కడన్నా అట్లా పెంచుకొని తినేసే రకాల లాగా కనిపిస్తున్నామా?" అంది.

చిట్టిపిల్ల ముక్కు ముడుచుకున్నది. అటూ - ఇటూ చూసింది. అక్కడే దగ్గర్లో దానికి ఒక అట్టపెట్టె కనబడింది. అది పోయి అట్టపెట్టెని జాగ్రత్తగా చూసింది. ఆ పెట్టెను తెరవచ్చు; మూయచ్చు!

చిట్టికోడిపిల్లకు చాలా సంతోషం వేసింది. ఆ సరికి తల్లికోడి ఓ పేడకుప్ప నీడకు చేరుకొని నేలను గీరుతోంది, "ఇక్కడ చాలా పురుగులున్నెయ్యో.....చ్" అని అరిచింది గట్టిగా.

కోడిపిల్లలన్నిటితో బాటు మన చిట్టికోడి కూడా, గబగబా అక్కడికి పరుగుపెట్టింది. అట్టపెట్టెను ప్రక్కన పడేసి తనూ మూగి చూసింది. అక్కడ నిజంగానే చాలా పురుగులున్నై.

చిట్టికోడి పిల్ల గబగబా కొన్ని పురుగుల్ని పట్టుకొని అట్టపెట్టెలోకి తీసుకున్నది. ఆ రోజంతా దానికి అదే పని! తినటం మానేసి పురుగుల్ని సేకరిస్తూ గడిపిందది. తల్లి కోడి దాని చేష్టల్ని చూసి నవ్వుకున్నది మురిపెంగా - "నిజంగానే ఇదొక తిక్కపిల్ల.." అనుకున్నది.

ఆ రోజునించీ చిట్టికోడి పురుగుల గురించే చాలా ఆలోచించటం మొదలు పెట్టింది. "పురుగులు ఏం తింటాయి? ఎట్లా ఉంటాయి? ఏం చేస్తాయి? ఎక్కడ పడుకుంటాయి?" -శ్రద్ధగా అట్టపెట్టెనంతా పురుగులకు అనుకూలంగా చేసిందది.

కొన్ని రోజులకి నిజంగానే, పురుగులు గుడ్లుపెట్టాయి! వాటిలోంచి చిట్టి చిట్టి పురుగులు బయటి కొచ్చి, అట్టపెట్టె లో పారాడాయి.

వాటిని చూసి చిట్టికోడిపిల్ల ఎంత సంతోషపడ్డదో! అది వాటిని కదిల్చింది, వాటిపైన అన్నం మెతుకులూ, గింజలూ వేసింది. వాటితో మాట్లాడింది. వాటితో ఆడుకున్నది.

చూస్తుండగానే ఆ పురుగులన్నీ పెద్దవైనాయి.

తల్లికోడి అన్నది పిల్లకోడితో - "ఊఁ.. ఇప్పుడు తినచ్చు వీటిని! నిజంగా బలేపని చేశావు - అచ్చం మనిషిలాగానే!" అన్నది.



తల్లి అట్లా అనగానే, అంత వరకూ హుషారుగా ఆడుకుంటున్న చిన్నకోడి ఒక్కసారిగా చిన్నబోయింది. "చిట్టి చిట్టి యీ పురుగుల్ని తను తినెయ్యాలా?! ఎంత మోసం!" అనిపించింది దానికి. తర్వాతి రోజంతా అది పురుగుల్నే చూస్తూ గడిపింది. రాత్రంతా నీరసంగా ఒక్కతే పడుకొని ఏడ్చింది.

తెల్లారి తల్లికోడి లేచి చూస్తే అట్టపెట్టె అంతా ఖాళీ - చిట్టికోడిపిల్ల పురుగులన్నిటినీ తీసుకెళ్లి ఎక్కడో వదిలేసి వచ్చింది!

తల్లికోడి చిట్టిపిల్లను దగ్గరకు తీసుకొని అన్నది - "నేను ముందే చెప్పలేదూ- మనం మనుషులం కాము తల్లీ; అట్లా పెంచుకొని పెంచుకొని చివరికి తినెయ్యటానికి! మనం కోళ్లం! నిజంగానే నువ్వు మన పేరు నిలబెట్టావు!" అని మెచ్చుకున్నది.

చిట్టికోడికి మటుకు ఏమీ అర్థం కాలేదు- అట్టపెట్టెలో హడావిడిగా అటూ ఇటూ తిరిగి అల్లరి చేస్తున్న చిట్టిపురుగులే తిరుగు-తున్నాయి దాని ఆలోచనలనిండా. ★

సర్వర్: చట్నీ లేని ఇడ్లీ, కూరలేని పూరీ, పంచదార లేని కాఫీ- వీటిలో ఏం కావాలి సార్?

కస్టమర్: చెప్పినవన్నీ ఇచ్చి, అంకెలు వేయని బిల్లు ఇవ్వు.



బరువు

పిల్లలు హాయిగా ఉంటారు. బాగా ఆడతారు, తింటారు, నిద్రపోతారు, నవ్వుతారు. పెద్దవుతున్నకొద్దీ చదువులు, నేర్చుకోవటాలు- ఇంకా ఏవేవో మొదలవుతాయి- మెల్లగా బరువులు, బాధ్యతలు పెరుగుతాయి. చాలాసార్లు 'ఈ బరువు చాలు- ఇక మొయ్యలేను' అనుకుంటాం గానీ, నిజంగా ఆ ఆలోచన మూలాల్లోకి వెళ్ళి చూస్తామా...?

కట్టెలు కొట్టే రంగయ్య ఎప్పటిలాగే అడవికి వెళ్ళాడు. మధ్యాహ్నం వరకూ కట్టెలు కొట్టాడు. కొట్టిన కట్టెలన్నిటినీ పెద్దమోపుగా కట్టాడు. ఎంతో శ్రమపడి ఆ మోపును నెత్తికి ఎత్తుకున్నాడు. వాటి బరువుకి అతని వెన్నెముక వంగింది; శరీరం వణికింది. అయినా అతను వాటిని మోసుకుంటూ నడకసాగించాడు.

అది అతను ఎప్పుడూ వెళ్ళే దారే. కానీ ఇప్పుడు మటుకు నడక చాలా కష్టంగా ఉంది. అడుగు ముందుకి పడటంలేదు. అట్లా అని కట్టెలు

ఎప్పటికంటే మరీ ఏమంత బరువుగా లేవు. అకస్మాత్తుగా రంగయ్యకి తెలిసి వచ్చింది- కష్టం ఎందుకవుతున్నదో! తను ముసలి వాడవుతున్నాడు!!

ఒకసారి ఆ ఆలోచన రాగానే రంగయ్య ఇక బరువును మోయలేక పోయాడు: తలమీద మోపును క్రింద పడేశాడు; తనూ నేల మీద కూలబడి, నెత్తిన చేతులు పెట్టుకొని తన భవిష్యత్తు గురించి ఆలోచించుకొని ఏడ్చాడు.

"అయ్యో! దేవుడా!! నాకీ కష్టం వద్దు. అసలు యీ జీవితమే వద్దు. ముగించెయ్యి. నన్ను తీసుకెళ్లిపో," అని బిగ్గరగా అరిచాడు.


సరిగ్గా అదే సమయానికి మృత్యుదేవత అతని మీదుగా వెళ్తున్నది- రంగయ్య కోరిక వినబడగానే ఆ తల్లి గబుక్కున అతని ముందు ప్రత్యక్షం అయ్యింది. "ఏమన్నావ్?! ఏమన్నావ్?! మళ్లీ అను, ఓ సారి?! నీ కోరికని తక్షణం నెరవేరుస్తాను, చెప్పు" అన్నది గట్టిగా.

రంగయ్య కొద్దిసేపు వినబడీ వినబడకుండా ఏదో గొణిగాడు.

ఆ తర్వాత చక్కగా వినబడేట్టు అన్నాడు - "తల్లీ, నాకో సాయం చెయ్యి. యీ కట్టెల మోపుందే, దాని కొంచెం ఎత్తి నా తల మీద పెట్టు, చాలు- ఆ తర్వాత నా తంటాలేవో నేను పడతాను!" అని.



రకరకాల బరువులు మోయటం అలవాటైన ప్రాణాలు మనవి! అలసట కొద్దీ కాస్త అటూ ఇటూ ఊగినా, చివరికి ఆ బరువుల్ని మోయటం వైపే మొగ్గుతాం!



దేవుడి పటం నుండి విభూది!

రచన: యస్.శంకరశివరావు, ఉపాధ్యాయుడు/ఇంద్రజాలికుడు, యంపియుపియస్, బద్దలాపురం, కనగానపల్లిమండలం, అనంతపురం జిల్లా.

సీతమ్మధారలో ఉండే సుభద్రమ్మకు యాభైఏళ్ళు. రిటైర్డు భర్త క్రిష్ణయ్య, కొడుకు సుభాష్, కోడలు రమ్య, మనవడు "టబా"- వీళ్ళు, ఆమె ప్రపంచం.

సుభద్రమ్మకు దైవభక్తి, నమ్మకాలు ఎక్కువ. అందరు దేవుళ్ళనూ కొలుస్తుంది; సాయిబాబా గుళ్ళో భజనలు చేస్తుంది.

ఓ గురువారం నాడు క్రిష్ణయ్యగారు బజారుకు వెళ్ళారు. కొడుకు-కోడలు ఆఫీసుకు, మనవడు బడికి వెళ్ళారు. సుభద్రమ్మ ఒక్కతే కూర్చొని "శిరిడి సాయి" సీరియల్ చూస్తున్నది.

అంతలో వ్యాపార ప్రకటనలకోసం ఓ 'బ్రేక్' వచ్చింది. ఎప్పటి మాదిరే , సుభద్రమ్మ ఛానెల్

మార్చింది-

న్యూస్ ఛానెల్‌లో కూడా బాబాగారు కనబడ్డారు. జగదాంబ సర్కిల్‌లో "డాక్టర్ గాంగేయ"గారి ఇంట్లో- బాబాగారి ఫొటో నుండి విభూది రాలుతున్నదట! ఛానెల్ వాళ్ళు ఆ చూపిన దృశ్యాన్నే మళ్ళీ మళ్ళీ చూపిస్తున్నారు. చూసిన కొద్దీ సుభద్రమ్మకు ఒళ్ళు పులకరిస్తున్నది.


సీతమ్మధార నుండి జగదాంబ సర్కిల్ ఏమంత పెద్ద దూరం లేదు- అరగంట ప్రయాణం. ఇక వెనుకా ముందు ఆలోచన చేయలేదు సుభద్రమ్మ. ఇంటికి గొళ్ళెం వేసింది; తాళం వేయ మరచింది; గబగబా టౌన్‌సర్వీస్ ఎక్కింది; డాక్టర్ గాంగేయ గారి ఇల్లు చేరింది.

అప్పటికే చాలా మంది గుమిగూడి వున్నారు అక్కడ. భజనలు మొదలు పెట్టారు. సుభద్రమ్మ కూడా ఆ భజన బృందంలో చేరి పోయింది.

అన్ని టీవీ ఛానెళ్ళూ విభూది వార్తను ప్రముఖంగా- మళ్ళీ మళ్ళీ ప్రసారం చేసాయి . రాను రాను ఇంకా ఎక్కువ మంది భక్తులు వచ్చి చేరుకున్నారు అక్కడికి.

బారులు తీరిన భక్తుల సౌకర్యం కోసం బారికేడ్లు, ముడుపులు చెల్లించుకునేందుకు పెద్ద హుండీ ఒకటి ఏర్పాటు చేసాడు గాంగేయ. ఇప్పుడక్కడ జనం జాతరను తలపిస్తున్నారు.

అంతలో బజారు కెళ్ళిన క్రిష్ణయ్య తిరిగి వచ్చి చూసాడు- సుభద్రమ్మ కనబడలేదు ఇంట్లో. "గుడికి వెళ్ళిందేమో!" అనుకున్నాడు. భోజనం వడ్డించుకుని తిని పడుకున్నాడు. సాయంత్రం పిల్లలు, కొడుకు, కోడలు ఇంటికి వచ్చారు. "అమ్మ ఎటు వెళ్ళింది నాన్నా?" క్రిష్ణయ్యను నిద్ర లేపి అడిగాడు సుభాష్.



"నేను బజారునుండి వచ్చేటప్పటికే మీ అమ్మ ఇంట్లో లేదురా" సమాధానం ఇచ్చాడు క్రిష్ణయ్య- "కొంచెం సేపు వేచి చూశాను- మళ్లీ- 'గురువారం కదా! బాబా గుడికి వెళ్ళిందేమో!' అనుకుని అన్నం తినేసి పడుకున్నాను. ఇంత వరకూ రాలేదా? ఏమైందో- ఎక్కడుందో?!" కంగారుగా అన్నాడు.


ఊర్లో వున్న బంధుమిత్రులందరికీ ఫోన్ చేసి విచారించారు- సుభద్రమ్మ జాడలేదు.

రాత్రి పది అయింది- "ఇంక వేచి చూడకూడదు- పోలీసులకు కంప్లయింట్ ఇవ్వాల్సిందే!" అన్నది రమ్య. "సరే!" అని అందరూ స్టేషన్‌కు బయలు దేరుతున్నారు- అంతలోనే- టి.వీ చూస్తూన్న చిన్నోడు టబా "అదిగో, నానమ్మ! నానమ్మ అదిగో!" అని కేకలు వేశాడు.

అందరు ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి చూశారు- "అదిగో, చూడండి! నానమ్మ!" అని టివికేసి చూపిస్తున్నాడు టబా.

ఫొటో నుండి విభూది రాలటం చూపిస్తున్నారు టివిలో ఇంకా. అక్కడికి చేరుకున్న భక్తుల్ని, భజనలు చేసే వాళ్ళని పదేపదే చూపిస్తున్నారు.

భజన బృందంలో కూర్చొని ఉన్నది, సుభద్రమ్మ! పరవశత్వంలో ఒళ్ళు మరచి ఉన్నది. కళ్ళు మూసుకొని, సంతోషంగా పాటలు పాడుతున్నది.



విషయం అర్థమైంది అందరికీ. గబగబా ఓ ట్యాక్సీ ఎక్కి గాంగేయ గారి ఇల్లు చేరారు అందరూ.

అక్కడ ఇసుక వేస్తే రాలనంత జనం! జనాలని నెట్టుకుంటూ, తోసుకుంటూ ముందుకి చేరుకున్నారంతా. అక్కడ భజన చేస్తూ కూర్చొని ఉన్నది సుభద్రమ్మ!

"అమ్మా!" పిలిచాడు సుభాష్. సుభద్రమ్మ కళ్ళు తెరచి చూసింది- "రా నాయనా, రా! మీరు అందరూ వచ్చారూ?! చాలా సంతోషం. అంతా భగవంతుడి లీల, ఫోటో నుండి విభూది రాలడం అంతా దైవలీల! చూశారుగా?" అంది సుభద్రమ్మ ఇంకా పరవశంలోనే.

"దైవలీల లేదు, చింతకాయ లేదు- అంతా మోసం! అమాయక భక్తులను మోసం చేసే పద్ధతుల్లో ఇదొకటి. హుండీ పెట్టారు చూడూ?! ఇదే, వాళ్ల మోసానికి నిదర్శనం. నీ కోసం వెతకని చోటు లేదు- తెలుసామ్మా? నీకు చాదస్తం, మూఢనమ్మకాలు మరీ ఎక్కువ అయ్యాయి- నిజం! 'అదిగో పులి' అంటే, 'ఇదిగో తోక' అంటావు. ఇట్లా అయితే ఎట్లా?" మందలించాడు సుభాష్.

చుట్టూ చేరిన భక్తులు వింతగా చూడటం మొదలు పెట్టారు వీళ్ళవైపు.

పరిస్థితిని చక్క దిద్దటం కోసం అన్నాడు క్రిష్ణయ్య- "చూడు సుభద్రా, మన ఇంట్లో ఫోటో కూడా విభూతి రాలుస్తుంది- తెలుసా?" అని.

"అదెట్లా?" అడిగింది సుభద్రమ్మ.

"ఇంటికి పద, చూపిస్తాను" అని ఆమెను కూడా ఇంటికి బయలు దేరదీశారు అందరూ.

మధ్యదారిలో టాక్సీని ఆపి, సైన్సు రసాయనాలు అమ్మే ఓ దుకాణంలోకి వెళ్ళి, ఏదో ఓ సీసా కొనుక్కొచ్చాడు క్రిష్ణయ్య.

ఇల్లు చేరీ చేరగానే మొదలు పెట్టింది సుభద్రమ్మ- "ఏదీ, మన ఇంట్లో కూడా విభూది రాలుతుందన్నారుగా?! రాల్చండి చూద్దాం!" అని.

"కొంచెం ఆగు, రాలుస్తుంది నిజంగానే- చూద్దువు; కొంచెం ఓపిక పట్టు-" అంటూ లోపలి గదిలోంచి బాబాగారి పటాన్ని తెచ్చాడు క్రిష్ణయ్య. బాబాగారి పటానికి చక్కని అల్యూమినియం ఫ్రేం ఉంది- తెల్లగా మెరుస్తున్నది.

"ఇదిగో, దీన్ని గుర్తు పట్టావుగా, మన ఇంట్లో ఫొటోనేగా? ఇక ఇప్పుడు దీన్ని తీసుకో. బాబాగారి ఫొటో ఫ్రేముకు ఈ ద్రావణాన్ని పట్టించు, బాగా" తను తెచ్చిన సీసాని సుభద్రమ్మకు అందిస్తూ చెప్పాడు క్రిష్ణయ్య.

"ఏమిటిది?- మెర్క్యురిక్ క్లోరైడ్"- సీసా మీద లేబుల్ చదివింది సుభద్రమ్మ.

"ఏదో ఓ రసాయనం! చెబుతాగా, ముందు నేను చెప్పినట్లు చెయ్యి- ఫ్రేముకు దీన్ని పట్టించు" గట్టిగా చెప్పాడు క్రిష్ణయ్య.

ఆమె సీసాలోని రసాయనాన్ని ఫొటో ఫ్రేముకు పట్టించింది. బాబాగారి ఫొటోని అక్కడ పెట్టి, వెళ్ళి చెయ్యి కడుక్కొని వచ్చింది.

"చూడు, విభూతి రాలుస్తోంది!" అందరూ అరిచారు.

'నిజంగానే ఫొటో నుండి విభూతి రాలుతున్నది!' నిర్ఘాంతపోయింది సుభద్రమ్మ.

"చూడండి, అందరూ- మెర్క్యురిక్ క్లోరైడు ద్రావణం అల్యూమినియంతో కలవగానే ఒక రసాయనిక చర్య మొదలవుతుంది. ఫలితంగా 'అల్యూమినియం క్లోరైడు' అనే పొడి ఒకటి తయారవుతుంది. అది ఫొటో ఫ్రేమునుండి రాలుతున్నప్పుడు, చూసేందుకు అచ్చం విభూతిలాగానే ఉంటుంది. మనం ఏం చేయాలంటే, బజార్లో దొరికే విభూతి ఒకటి రెండు కిలోలు కొనుక్కొచ్చి, ముందుగానే ఆ ఫొటో ముందు పోసి ఉంచాలి- ఇప్పుడు ఫొటో ఫ్రేం లోంచి కొద్ది కొద్దిగా అల్యూమినియం క్లోరైడు రాలుతుంటే, చూసేవాళ్లకు మటుకు "అక్కడున్న బూడిద మొత్తం ఫొటోలోంచే రాలిందేమో" అనిపిస్తుంది!"

సుభద్రమ్మ మారు మాట్లాడలేదు. ఫొటోకి మరికొంత మెర్క్యూరిక్ క్లోరైడు పూసి, దండ వేసి బల్లమీద నిలబెట్టింది. కొంతసేపటికి మళ్ళీ బూడిద రాలడం మొదలయ్యింది. "ఈ విషయం మనం టీవీ వాళ్ళకు చెబుదామా?" అడిగాడు క్రిష్ణయ్య, సుభద్రమ్మను వెక్కిరిస్తూ.


"మనకేం ఖర్మ?! మోసం చెయ్యటం మన ఇంటా వంటా లేదు. భక్తులను దోపిడీ చేస్తే వచ్చేది నరకమే. ఇంతలా దగా చేస్తే ఇంక పుణ్యం ఎక్కడినుండి వస్తుంది?!" అంది సుభద్రమ్మ కోపంగా.

"మరి ఆ డాక్టర్ గాంగేయగారి ఇంట్లో జరిగింది ఇదేగా?!" అన్నాడు క్రిష్ణయ్య, తాపీగా.

"అవునమ్మా! వినాయకుడు పాలు తాగడం, బ్రహ్మంగారి కంటి నుండి నీళ్ళురావడం, మేరీ

మాత ఏడ్వడం, విగ్రహాలు వింతగా ప్రవర్తించడం- ఇవన్నీ రసాయన శాస్త్ర ప్రయోగాలే! శాస్త్రీయంగా పరిశోధిస్తే, 'వీటన్నిటి వెనకా ఉన్నది ఆ దేవుళ్ళు మటుకు కాదు' అని స్పష్టం అవుతుంది" అన్నాడు సుభాష్.

సుభద్రమ్మకు కళ్ళు తెరచుకున్నాయి. "ఇంకెప్పుడూ ఇలాంటివి నమ్మనులెండి. మోసం చేసే వాళ్లకి శిక్ష పడేట్లు చేస్తాను- చూస్తుండండి" అంది ఆవేశంగా.



నిరీక్షణ

బొమ్మకు కథ రాయండి

నిర్వహణ: శ్రీమతి జి.లలిత, telugu4Kids.com



నిరీక్షణ అంటే తెలుసుగా, 'వేచి చూడటం'- ఇదిగో, ఇక్కడ నిల్చున్న పాప లాగా దేనికోసమో ఎదురు చూస్తూ నిలబడటం.

ఇంతకీ ఈ పాప ఎందుకు, ఇట్లా ఎండలో, రోడ్డు ప్రక్కన నిలబడి చూస్తున్నది? బస్సు కోసమా? లేకపోతే రోడ్డు దాటదామనుకుంటున్నదా? ఎక్కడికి వెళ్తున్నది...? కొంచెం ఆలోచించారంటే మంచి కథ ఒకటి తడుతుంది మీ మనసుకు. ఆ కథని రాసి మాకు పంపండి. బాగుంటే రెండు నెలల తర్వాత ప్రచురిస్తాం. మొదలుపెట్టండి మరి!

మా చిరునామా: కొత్తపల్లి బృందం, యం ఆర్ వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్- 515101
ఫోను: 08559 240222, 7702877670. ఇ-మెయిలు: team@kottapalli.in

కెంట్ మెల్విల్

యువకెరటాలు
నిర్వహణ: సౌమ్య, పుస్తకం డాట్ నెట్.



మొన్నొక రోజున ఓ స్నేహితురాలు పంపిన ఈ-మెయిల్‌తో కెంట్ మెల్విల్ గురించి తెలిసింది. అతని కథ చాలా స్ఫూర్తివంతంగా అనిపించింది. అందువల్ల అతన్ని మీకు కూడా పరిచయం చేస్తున్నాను.

కెంట్ మెల్విల్ తొమ్మిదేళ్ళ అబ్బాయి. ఆ అబ్బాయికి ఈ వయసులోనే సొంతంగా ఒక వ్యాపారం ఉంది. తన పేరుతోనే "కెంట్స్" అన్న బ్రాండు కూల్ డ్రింకులు అమ్ముతూ ఉన్నాడు ఇప్పుడు. ఈ అబ్బాయి కథలో విశేషం, ఇలా ఇంత చిన్న వయసులో సొంత వ్యాపారం పెట్టడం ఒక్కటే కాదు: అతనికి ఆటిజం అన్న మానసిక రుగ్మత ఉంది. ఈ సమస్య ఉన్నపిల్లలకు వాళ్ళ ఊహల్ని ఇతరులతో చెప్పటం, బాంధవ్యాల్ని ఏర్పరచుకోవటం కష్టం అవుతుంటుంది. ముఖ్యమైన విషయం ఏమిటంటే, కెంట్ మెల్విల్ ఈ వ్యాపారం ద్వారా వచ్చే సంపాదనని అంతా కూడా తనలా మానసిక వ్యాధులు ఉన్న పిల్లల కోసమే ఖర్చు చేస్తున్నాడు!

కెంట్ వాళ్ళ నాన్న వాళ్ళ ఊళ్ళోనే ఒక కాలేజీలో బిజినెస్ పాఠాలు చెప్పే లెక్చరర్. ఒక వేసవిలో కెంట్ ఒక "సమ్మర్ లేమనేడ్ స్టాండ్" పెట్టాడు. అంటే, వేసవికాలంలో నిమ్మరసం అమ్మి కొంచెం డబ్బులు సంపాదించటం అన్నమాట. అమెరికాలో కొంతమంది పిల్లలు వేసవిలో ఈ పని చేస్తూ ఉంటారు. నిజానికి అలా అమ్మడానికి ఒక లైసెన్స్ ఏదో కావాలి- కానీ, ఏదో మన వీధిలో మనం ఒక చిన్న బండి పెట్టుకుంటే, ఎవరూ పట్టించుకోరు కదా.. అట్లా కెంట్ పెట్టుకున్న లేమనేడ్ స్టాండ్‌కి ఒక ఏడాది లాభం వచ్చింది. దాంతో "నేను సొంతంగా సోడా కంపెనీ పెడతాను" అన్నాడు అతను వాళ్ళ

నాన్నతో. వాళ్ళ నాన్న ఒక పట్టాన ఒప్పుకోలేకపోయాడు. ఆటిజం ఉన్న తన తొమ్మిదేళ్ళ కొడుకు సొంతంగా వ్యాపారం చేస్తాను అంటే ఎలా ఒప్పుకోగలడు? కానీ, కెంట్ ఆయనతో అన్నాడట- "నాన్నా, నాకు అన్నీ అమర్చి పెట్టడానికి నువ్వున్నావు. కానీ, నాలా ఆటిజం ఉన్న మిగతా పిల్లల మాటేమిటి? వాళ్ళకోసం నేనూ ఏదయినా చేస్తాను. నా వ్యాపారంలోంచి వచ్చే డబ్బుతో వాళ్లకి ఏమన్నా ఇస్తాను" అని. దాంతో వాళ్ళ నాన్న ఇక కాదనలేకపోయాడు. అలా, ఎనిమిదేళ్ల వయస్సులో కెంట్ వ్యాపారం మొదలయ్యింది.




తరువాత కుటుంబ సభ్యులు, తన తండ్రి చదువు చెప్పే కాలేజీలో విద్యార్థులు, ఇతర సలహాదార్లు అందరి సహకారంతో "Kent's bottled classics soda pop" అన్న కంపెనీ 2011 లో మొదలైంది. ప్రస్తుతం వివిధ రకాల సువాసనలతో కూడిన కూల్ డ్రింకులు అమ్ముతున్నారు ఆ కంపెనీ వాళ్ళు. వ్యాపారం మొత్తాన్నీ కెంట్ స్వయంగా పర్యవేక్షిస్తాడు. తనకి నచ్చిన రుచులతో కొత్త ఫ్లేవర్స్ రూపొందిస్తున్నాడు కూడా. అమ్మిన ప్రతి బాటిల్ వెలలోనూ కొంత భాగం ఆటిజం ఉన్న పిల్లల సంక్షేమం కోసం ఏర్పడ్డ ఒక చిన్న సంఘానికి చేరుతుంది. ఈ డబ్బుతో అలాంటి పిల్లలకోసం గెట్-టుగెదర్లు, కలిసి సినిమాలు చూడ్డం, ఆడుకోవడంలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. అలా, ఆటిజం కారణంగా ఇతరులతో కలువలేక పోయే వాళ్లను అందరినీ కెంట్ ఒక చోట కలుపుతున్నాడు అన్నమాట. ప్రస్తుతానికి కెంట్ వ్యాపారం విజయవంతంగా నడుస్తోంది!

'కలర్ సోడా తాగడం ఆరోగ్యానికి మంచిదేనా?' లాంటి ప్రశ్నల్ని ప్రక్కనపెట్టి ఈ పిల్లాడి కథని చదవండి. అంత చిన్న పిల్లాడొకడు తన మానసిక సమస్యను ఎదుర్కొంటూ ముందుకు సాగడమే కాకుండా, 'తనలాంటి వాళ్ల కోసం ఏదన్నా చేయాలి' అనుకోగలగటం, నిజంగా గొప్ప విషయమే, కదూ?

సమీక్ష

కొత్తపల్లి కథల పుస్తకం-54 పై ఒక సమీక్ష. నిర్వహణ: శ్రీమతి మాలతీకృష్ణ, విజయవాడ.



కొత్తదనంతో, చకచకా చదివించిన కథలతో ఈ సంచిక ప్రత్యేకంగా, ఆసక్తికరంగా అనిపించింది.

ముఖ్యంగా చెప్పుకోవలసింది 'దొందూ దొందే' కథ. మానసకి ప్రత్యేక ప్రశంశలు. ముగింపు ఊహించని విధంగా, భలేగా వుంది. కాకపోతే అందరూ దెయ్యాలైతే, 'మరి అవ్వ కూడానా?' అన్నది అర్థం కాలేదు.

నాగుల్‌షరీఫ్, యోగేశ్వర రెడ్డి ఎన్ని కథలు వ్రాసుంటారో ఇప్పటికి! వ్రాసిన కొద్దీ ఆలోచనలు పదునెక్కుతాయనడానికి ఉదాహరణ- షరీఫ్ వ్రాసిన 'మర్యాద మాటల పిచ్చుక'. దీని ముగింపు కూడా బాగుంది. ఐతే మధ్యలో 'చిలుక' ప్రస్తావన వచ్చింది ఎందుకనో! 'యుక్తి' లాంటి కథలు మునుపు చదివాం గానీ, 'ఇది క్రొత్తదే' అనిపించేలా వ్రాశాడు యోగి.

'అపకారికి ఉపకారము' నీతికథల ఫార్ములాకి ప్రతీక. కానీ పిల్లలకు మంచి-చెడుల అవగాహన పెద్దలతో సమానంగానో, లేదా మరి కాస్త ఎక్కువగానేనో ఉంటుందనిపించింది. 'ద్వేషం, అసూయలాంటి గుణాలు చెడ్డవి'అని తెలియడమే కాక, వాటితో నలిగే పోయే వారి పట్ల కూడా ఎలా ప్రవర్తించాలో చెప్పింది దివ్య! చిన్నపిల్లకి ఆ అవగాహన పెద్ద విషయమే.

32 వ పేజీలో ఇచ్చిన 'బాపూ బొమ్మ' అబ్బురపరచింది. ఒకే గీతతో అంత పెద్ద బొమ్మ గీద్దామని ఎలా అనిపించిందో, ఆయనకు!

ధనుంజయరావు రాసిన 'పరిపాలకు లెవరు?' బావుంది. "స్వాతంత్ర్యం తీసుకోవడానికి భారతదేశం ఇంకా సిద్ధంగా లేదు" అని బ్రిటిష్ వాళ్ళు చాలా కాలం పాటు అన్నారు- ఆ సంగతి గుర్తుకొచ్చింది ఈ కథ చదివాక. ఇక, సింహరాజు - 'అయ్యాడు' - 'పోతున్నది' అంటూ ఒకే కథలో , ఒకే పాత్రకి రెండు లింగాలు ఆపాదించే గందరగోళం గతంలో కూడా జంతువుల కథల దగ్గర జరిగింది. కొత్తపల్లి వారు వీటిని సవరించుకోవాలి.

శంకర శివరావు గారి 'తాయత్తు మహిమ' కథాంశం ఆసక్తికరంగా వుంది. అల్లిక మాత్రం కొంత గందరగోళంగా అనిపించింది. ముఖ్యంగా సీతాలు ఏకబిగిన ఇచ్చిన ఉపన్యాసంలో విషయం ఇంకొంచెం క్లుప్తంగా వుంటే బాగుండేదేమో అనిపించింది.

'రూమీ చెప్పిన కథలు' మొదలు పెట్టినందుకు కొత్తపల్లికి అభినందనలు. తప్పకుండా ఇది పిల్లలకు మంచి బహుమతి.

47 వపేజీలో కొటేషన్ మార్కుల గందరగోళం బాగానే ఉంది- కొత్తపల్లివారు సవరించుకోవాల్సిన మరో అంశం ఇది.

'వెనక కాళ్ళ దెబ్బ'లో ముందు తన కాళ్ళు తనకి సహకరించడం లేదనుకునేంత మూర్ఖంగా వున్న గాడిద, అంత వెంటనే పులి దురుద్దేశ్యాన్ని పూర్తిగా ఎట్లా అర్థం చేసుకుందో తెలీలేదు. ప్రాణం మీదికొస్తే అట్లా అవుతుందేమో మరి!

చివరగా - వీరాంజి రూపుదిద్దిన 'ధ్యానంలో వున్న గాంధీ' బొమ్మ చూసిన కొద్దీ మనసు ప్రశాంతమయ్యేట్లు వుంది. "పెన్సిల్ ముక్క" గాంధీగారి గురించి అంతకు ముందు చదవని ఓ కొత్త కథని చెప్పింది. చిన్న కథలో అంత పెద్ద విషయాన్నీ, బాపూ నిరాడంబర జీవితాన్నీ, ప్రేమనీ చూపిస్తూనే ఆయన మహా మొండిఘటమనీ చెప్పడం సరదాగా వుంది.

కొత్తపల్లి బృందానికి, పిల్లలందరికీ దసరా శుభాకాంక్షలు.

పదరంగం-21

ఈ పదరంగం చాలా సులభం ! దీన్ని ఓ పోస్టు కార్డులో పూరించి పంపండి. మీ పేరుతో బాటు మీ బడి పేరు, తరగతి తప్పక రాయండి. సరైన సమాధానాలు పంపిన పిల్లల పేర్లను పదరంగం-22 తో పాటు ప్రచురించగలం. నిర్వహణ: కొత్తపల్లి.

1	2		3	4	5
6		7		8	
9					
10			11		12
13					
			14		

ఆధారాలు నిలువు:

1. వంటల్లో వేసే సువాసన ఆకు-తీసిపారెయ్యద్దు!(5)

2. నవంబరు 14 ప్రత్యేకత (6)

4.తాడు, బొక్కెనతో నీళ్లు తోడుకునే బావి(4)

5. తేమ(2)

7. మరీ ఎక్కువ (2)

11. చంద్రుడి కోసం ఎదురుచూసే పువ్వు(3)

12. అమ్మలు! (3)

అడ్డం:

1. కోతే, మరోలా! (2)

3. ఆ చేత కాదు!(3)

6. గొడవ, తిరగబడింది కూడా (2)

8. కంచె, మరోలాగా (2)

9. దీర్ఘం తీసేస్తే స్త్రీ... కొంచెం కష్టమే!(3)

10. అయ్యో--! (2)

11. కవి సులభంగా చెప్పేసేది(3)

13.వినాయకుడికి ఇష్టమైనవి(4)

14. నూనెలో వేయిస్తారు, తింటే భలే ఉంటాయి!(3)

పదరంగం 20కు సరైన జవాబు

జా	తి	పి	త		భీ
మ	ర		ల	వ	ము
కా	కి	రః	క		డు
య	గ		ట్టు	కొ	
	సి	రా		న	గ
జ	టా	జూ	ట	ము	

రాసిన వాళ్ళు:

1. జి.సత్యలక్ష్మి, 3వతరగతి, ఇంటిబడి, చెన్నేకొత్తపల్లి.

2. జి. తరుణి, 5వతరగతి, గడ్డంనాగేపల్లి, నార్పల.

3. పి.అనూష, 5వ తరగతి, శ్రీ విద్యారణ్య ఇంగ్లీషు మీడియం హైస్కూల్, అనంతపురం.

4. పూజ, 5వ తరగతి, వికాసవిద్యావనం, పోరంకి, కృష్ణాజిల్లా.

చిలిపిప్రశ్నలు -తిక్కజవాబులు

సేకరణ: శ్రీవి.వి.యస్.మూర్తి, చొదిమెళ్ళ, పశ్చిమగోదావరి జిల్లా.

1. ఇంకేమీ చేయకుండా కట్టిపడేసే 'దనం' ఏంటి?

జవాబు: వందనం!

2. తినగలిగే నగ?

జవాబు: శెనగ!

3. అమెరికాలో సైనికులు కవాతు వేటితో చేస్తారు?

జవాబు: కాళ్ళతో!

4. గేటు తెరిచి వున్నా వెంగళప్ప పార్కులోకి ఎందుకు వెళ్ళటం లేదు?

జవాబు: బయట 'నో పార్కింగ్' అని ఓ బోర్డు వుందిగా?!

5. ధనవంతుడు ఏం సంపాదించాలి?

జవాబు: సంతృప్తి!

6. వెంగళప్ప కారుని ఎక్కడ పార్క్ చేస్తాడు?

జవాబు: పార్కులో!


8. పొరిగింటి పుల్లకూర రుచి- ఒక ఉదాహరణ ఇవ్వండి!

జవాబు: తెలుగు మేస్టారు తమ కొడుకుని ఇంగ్లీషు కాన్వెంట్ లో చదివించటం!

చిట్టి పాటలు

అదిగో అదిగో లైటు

గానం: బి.హేమ, 4 వతరగతి, యంపియుపియస్, బద్దలాపురం, కనగానపల్లిమండలం, అనంతపురంజిల్లా.





అదిగో అదిగో లైటు

అమ్మానాన్నఫైటు

కోడిగుడ్డు వైటు

నేను చెప్పింది రైటు

అరటి పండు చూడరా

గానం: పూజిత, 3 వతరగతి, యంపియుపియస్, బద్దలాపురం, కనగానపల్లిమండలం, అనంతపురంజిల్లా.



అరటి పండు చూడరా

అందమైన పండురా

కాయేమో పచ్చన-

అరటిపండు తియ్యన!

చిట్టి చిలకమ్మ

గానం: సింహాద్రి, 2 వతరగతి, యంపియుపియస్, బద్దలాపురం, కనగానపల్లిమండలం,అనంతపురంజిల్లా.

చిట్టి చిలకమ్మా

పలక ఏదమ్మా?

పావురాయమ్మ

పట్టుకెళ్లిందా?

పరుగున పోవమ్మా

పలక తేవమ్మా

పండు తిమ్మా!



చిట్టిచిట్టి మిరియాలు

గానం: మైత్రి,2 వతరగతి,యంపియుపియస్,బద్దలాపురం, కనగానపల్లిమండలం,అనంతపురంజిల్లా.



చిట్టి చిట్టి మిరియాలు

చెట్టూ కిందా పోసి

బొమ్మరిల్లు కట్టి

అల్లం వారింటికి చల్లకుపోతే

అల్లం వారి కుక్క "భౌ భౌ" మన్నది

నా కాళ్ళ గజ్జెల్ ఘల్ ఘల్ మన్నవి.

చిలకా చిలకా రావే

గానం: శివ, 2 వ తరగతి, యంపియుపియస్, బద్దలాపురం, కనగానపల్లిమండలం,అనంతపురంజిల్లా.

చిలకా చిలకా రావే

ఈగో గింజలు తినవే

రానూ రానూ దగ్గరకి

వస్తే నన్ను పట్టేస్తావ్

పంజరంలో పెట్టేస్తావ్



పగటి దీపం సూర్యుడు

గానం: హర్షిత, 4 వ తరగతి, యంపియుపియస్, బద్దలాపురం, కనగానపల్లిమండలం, అనంతపురంజిల్లా.



పగటి దీపం సూర్యుడు

రాత్రికి దీపం చంద్రుడు

జాతీయ దీపం విద్య

దానికి రూపం బాలలు

చదవాలి అందరం

చదవులేక అంధులం

చీకటి దారులు దాటగా

చదువేగద సాధనం!

విరబూసిన పువ్వులం

గానం: శైలజ, 7 వతరగతి, యంపియుపియస్, బద్దలాపురం, కనగానపల్లిమండలం, అనంతపురంజిల్లా.



విరబూసిన పువ్వులం చిరునవ్వుల బాలలం
లోగిలో తిరిగాడు చిన్ని చందమామలం
విరబూసిన పువ్వులం చిరునవ్వుల బాలలం

చల్లనైన వెన్నెలను ముంగిట్లో కురిపిస్తాం
ముద్దుముద్దు మాటలతో ఆనందం పంచుతాం
"విరబూసిన"

చిట్టి పలక చంక నెట్టి ప్రతిరోజూ బడికెళతాం
టీచరమ్మ నేర్పే ఆట కలసిమెలసి ఆడతాం
"విరబూసిన"

మేము భావిపౌరులం వెలుగునిచ్చే దివ్వెలం
ఇంటింటా కోరుకొనే చిరు నవ్వుల పాపలం
"విరబూసిన"

ముద్రిత ప్రతుల వెల: ప్రతి ఒక్కింటికి: 20 రూ.
12 పుస్తకాలకై చందా: రూ. **250/-**

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.
బ్యాంకు అక్కౌంటు వివరాలు:
"Kottapalli Trust", A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోన్లు: 08559 240222, 7702877670
ఇ-మెయిలు: team@kottapalli.in

ఈ నెలలో ఏపని-ఎవరిది?

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు
సంపాదకత్వం: నారాయణ
వెబ్సైటు, సాంకేతికత: ఆనంద్, లక్ష్మి
ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు
ముఖచిత్రం 'దీపావళి': వీరాంజనేయులు
చిత్రాలు: అడవి, ప్రసాద్, చంద్రకాంత్, గోపాల్, సురేష్, వినయ్, లక్ష్మివెంకట్, అంజి, శ్రీధర్, రామ్.
కథలు, పాటలు: చాలామంది పిల్లలు

ప్రత్యేక కృతజ్ఞతలు: రిషివ్యాలీ రూరల్ స్కూలు వారికి, అరవిందాహైస్కూల్ వారికి, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల బద్దలాపురం వారికి, మ్యాజిక్ కథల శంకర శివరావు గారికి, 'విద్యార్థి' మాలతీకృష్ణగార్లకి, కార్టూనిస్టు ఏవియం గారికి, రాధా రాజశేఖర్ గార్లకి, కంప్యూటర్లలో లైనక్సు వ్యవస్థను చక్కగా అందిస్తున్న ఉబుంటు వారికి, జింప్, అడాసిటీ తదితర ఓపెన్ సోర్సు సాఫ్టువేరు నిర్మాతలకు, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.

పిల్లల్లో సృజనాత్మకత సహజం. కథలు, ఆటలు, పాటలు, బొమ్మలు దానికి ఊతాన్నిస్తాయి. మాతృభాషలో ఇష్టంగా చదవటం, తేలికగా రాయటం వస్తే అటుపైన అన్ని శాస్త్రాలూ సులభంగా వంటపట్టుతాయి-నిజం! అందుకని మీ పిల్లల్లో ఉన్న కాల్పనిక శక్తికి పదును పెట్టండి. వాళ్లను కథలు రాసేందుకు, పాటలు పాడేందుకు, బొమ్మలు వేసేందుకు ప్రోత్సహించండి. వాళ్ళ రచనల్ని మాకు పంపండి. కావాలనిపిస్తే మీరే ఇలాంటి పత్రికనొకదాన్ని మొదలు పెట్టండి- ఎలాగైనా సరే- పిల్లలు పెద్దవాళ్లయ్యేలోగా వాళ్ళు చాలా చాలా తెలుగు కథల్ని చదివేలా, రాసేలా చేయండి. మీ పిల్లలకు ఈ పత్రికలోని కథలు నచ్చుతాయనే మా నమ్మకం- వీటిని వీలైనంత మందితో పంచుకోండి. మీరు రాసిన పిల్లల కథలు ఏమైనా ఉంటే పనిగట్టుకునైనా సరే, మాకు పంపండి. వీలు చేసుకొని ప్రచురిస్తాం.

మంచి పుస్తకం:

జాతీయాల పుట్టుపూర్వోత్తరాలు మరియు సంస్కృత న్యాయాలు

"ఇంతకష్టంపేరా!" అని భయపడకండి!


ఇందులో ఉన్నవి ఓ 150 చిట్టి చిట్టి కథలే! అవీ రెంటాల గోపాల కృష్ణగారు తనదైన చక్కని శైలిలో చెప్పిన మంచి కథలు!

ఒక్కో కథా ఒక్కో జాతీయాన్ని అర్థం చేయిస్తూండటం చాలా బాగుంటుంది కూడానూ!

మీకు తెలుసా, "ఇసుక తక్కెడ, పేడ తక్కెడ" అని ఎప్పుడంటారో? "దొందూ దొందే" అని ఎప్పుడంటారు? "గోడపెట్టు- చెంపపెట్టు" కథ తెలుసా? "తూ.చ. తప్పకపోవటం" అంటే? ఇలాంటి జాతీయాలు భాషకు ఎక్కడలేని సొగసులను ప్రసాదిస్తాయి. ఈ జాతీయాల్ని అర్థం చేసుకునేందుకు, గుర్తుంచుకునేందుకు, వాటిని వాడుకొని మన భాషను పరిపుష్టం చేసుకొనేందుకు వాటి వెనక ఉన్న కథలు తెలుసుకోవటం చాలా అవసరం!

ఆ అవసరం ఇలాంటి చాలా చక్కని పుస్తకాల్ని చదవనిదే ఏ మాత్రం నెరవేరదు.


తెలుగు భాషను ప్రేమించేట్లు చేసే ఇలాంటి పుస్తకాలు నిజంగా అమూల్యమైనవి. పదోతరగతికి వచ్చేలోగా ప్రతి చిన్నారీ తప్పకుండా చదవాల్సిన మంచి పుస్తకం ఇది !! ఎక్కడున్నా సంపాదించండి!



జాతీయాల పుట్టు పూర్వోత్తరాలు, మరియు సంస్కృత న్యాయాలు (1998)

రెంటాల గోపాలకృష్ణ, గంగాధర పబ్లికేషన్స్,

రామమందిరం వీధి, విజయవాడ. (184p, 25 రూ.)



Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559240222 E-mail: team@kottapalli.in and printed at Mudrica Offcet Printers, Vijayawada,Phone:08662579129